### పార్టీ బలోపేతంపై "దేశం" నేతల వైఖరిలో

# మార్పు వచ్చేనా!?

**వ్యతిరేకత, సానుకూలత గెలుపుపై భిన్నాభిప్రాయాలు!!**



ప్రభాతవార్త-తిరుపతి:
రాష్ట్రంలో ఇటీవల జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతిపక్ష తెలుగుదేశంపార్టీ అభ్యర్థులు ముగ్గురు విజయం సాధించడం పై సొంత పార్టీలోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇది ఒక విధంగా పార్టీ శ్రేణులు అనుకోని విజయంగా భావిస్తున్నారు. నాలుగేళ్ళ వైసిపి ప్రభుత్వ పాలనపై వ్యతిరేకత, ప్రతిపక్షనేత ,రాజకీయ చాణుక్యుడు చంద్రబాబు దక్షత పట్ల ఉన్న సానుకూలత ఓట్ల రూపంలో పట్టభద్రులు తీర్పునిచ్చారని చర్చించుకుంటున్నారు. ఇదే తీరు ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో ఓట్లుగా కనిపించాయని అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో ఎప్పుడూ లేని విధంగా మూడు పట్టభద్రుల నియోజక వర్గాలలో టిడిపి అభ్యర్థులు గెలవడంతో టిడిపి నేతల్లో ఇకనైనా మార్పు కనిపిస్తుందా!?ఐక్యతతో కలసి పనిచేస్తారా అనే వాదనలు జోరందు కుంటున్నాయి. వైసిపి నేతలు భారీగా బోగస్ ఓట్లు చేర్పించడం, అక్రమార్గాలు అనుసరించినప్పటికీ గెలవలేకపోయారని చెబుతున్నారు. టిడిపి అభ్యర్థులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేసినా ఓటర్లకు తాయిలాలు ఇవ్వకపోయినా విజయం సాధించారనేది పార్టీ వర్గాల్లో కొత్త రాజకీయ ఒరవడికి పునాదిగా బలమైన విశ్వాసం వ్యక్తమవుతోంది. దీంతో టిడిపి నాయకులు,కార్యకర్తలు సంతోషంగా ర్యాలీలు,ఊరేగింపులు చేస్తున్నారు. 2024 ఎన్నికల్లోనూ గెలుపు మనదేనంటూ సంబరపడుతున్నారు. అయితే ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం కేవలం వాపు మాత్రమేనని బలుపు కాదని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. గతంలో వరుసగా గెలిచిన ఉభయకమ్యూనిస్టులు ఒక్క ఎమ్మెల్సీ స్థానంలో కూడా గెలవకపోవడాన్ని మరీ చర్చించుకుంటున్నారు. ఈ ఎన్నికల ఫలితాలను చూసి మురిసిపోవడం కాదని, జిల్లాలో టిడిపిలో క్రిందిస్థాయి కార్యకర్తలు,యువత పటిష్టంగా పార్టీకోసం పనిచేస్తున్నా, కొందరు నాయకులు అవకాశవాద రాజకీయాలు చేస్తున్నారనే వాస్తవాలను చంద్రబాబు ,లోకేష్ గ్రహించాలని కార్యకర్తలు చెబుతున్నారు. గతంలో అధికారంలో ఉన్నసమయంలో ప్రభుత్వంలో చక్రం తిప్పి డబ్బు,హోదా సంపాదించుకున్న జిల్లాలోని కొందరు నేతలు 2019లో పార్టీ ఓడిపోగానే ముఖంచాటేసి సొంత వ్యాపారాలుచేసుకుంటున్నారని విమర్శలు లేకపోలేదు. అలాంటి వారు కొందరు ఎమ్మెల్సీ ఎన్నికల విజయంతో మళ్ళీ పార్టీవైపు చూస్తున్నారని కార్యకర్తలు విరుచుకుపడుతూన్నారు. చంద్రబాబు సొంత జిల్లాలో ఇలాంటివాళ్ళు ఎక్కువగా ఉన్నారని, అవకాశవాదులను,పార్టీకోసం ధీటుగా పనిచేయని నేతలను పక్కన పెట్టి పనిచేసే వారిని ప్రోత్సహిస్తే తప్ప 2024 ఎన్నికలను సవాల్‌గా తీసుకుని పనిచేయలేరని బాహాటంగా వ్యాఖ్యలు వినిపిస్తున్నారు. ఇదే అవకాశంగా ఉమ్మడి చిత్తూరుజిల్లాలో రానున్న రోజుల్లో ఇన్‌ఛార్జిలు, అభ్యర్థులుగా పలువురు కొత్తవాళ్ళు తెరపైకి వచ్చినా ఆశ్చర్యపోవలసిన విషయం లేదని కార్యకర్తలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



## 26న ఎల్‌విఎం3 రాకెట్ ప్రయోగం

**- షార్‌లో శాస్త్రవేత్తలు బిజీ**




శ్రీహరికోట (తడ), మార్చి 19 ప్రభాతవార్త
శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ అంతరిక్ష కేంద్రం నుంచి ఈ నెల 26న ఉదయం 9 గంటలకు ఎల్‌విఎం3 భారీ రాకెట్‌ను ప్రయోగిస్తున్నారు. 36 కమర్షియల్ ఉపగ్రహాలను రాకెట్ ద్వారా అంతరిక్షంలోకి చేరుస్తున్నారు. 5805 కిలోల బరువు ఉన్న వన్‌వెబ్ సంస్థకు చెందిన శాటిలైట్లు ఈ శ్రేణిలో ఉన్నాయి. శ్రీహరికోట నుంచి కమర్షియల్ ప్రయోగాలు జరపడం కొత్త కాకపోయినప్పటికీ వన్‌వెబ్ సంస్థకు చెందిన పలు ఉపగ్రహాలను మన రాకెట్ల ద్వారా ప్రయోగించడానికి ఇస్రో గతంలోనే ఒప్పందం చేసుకుంది. గత ఏడాది అక్టోబర్‌లో ఎల్‌విఎం3 రాకెట్ ద్వారా ఒకేసారి 36 ఉపగ్రహాలను ప్రయోగించి ఉన్నారు. షార్‌లో ప్రస్తుతం రాకెట్ ప్రయోగ సన్నాహాల్లో శాస్త్రవేత్తలు నిమగ్నమయ్యారు. ఈ ప్రయోగం తర్వాత మరో వారంరోజుల వ్యవధిలోనే పిఎస్‌ఎల్‌వి సి-55 రాకెట్‌ను శ్రీహరికోటలోని ఫస్ట్ లాంచ్‌ప్యాడ్ నుంచి ప్రయోగిస్తున్నారు.

# అకాల వర్షం నీట మునిగిన పంటలు



పలమాల పొలాలో వర్షం తాకిడికి మునిగిన వరి ధాన్యం



వర్షంలో తడిసిన మిరప కాయలు

బుచ్చినాయుడు కండ్రిగ, మార్చి 19 ప్రభాతవార్త:
పొలంని నమ్ముకుని ఆరు కాలం కష్టపడి బతుకు జీవనం సాగించే రైతన్నకు ఎప్పుడు కష్టాలే. వరి పోసేటప్పుడు, నాట్లు నాటేటప్పుడు, 12 పంట చేతికి వచ్చేటప్పుడు అకాల వర్షాలతో ఎప్పుడు రైతన్నకు ఏదో ఒక విధంగా నష్టాలకు గురై కష్టాలపాలై అప్పుల బారిన పడుతున్నారు. ప్రభుతత్వాలు తూతూ మంత్రంగా హడావుడిగా సర్వేలు చేఇస నష్ట పరిహారం అందిస్తామని చెప్పి మాటలకే పరిమితం అవు తున్నారు. బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలు వలన వరి పంట, మిరప పంట మునిగి తడిసిపోయింది. వరి పంట కోత కోసి పోగు చేసిన వరి ధాన్యం, మిరప కాయలు పంట తడిసిపోవడంతో ఎలా అమ్మి సొమ్ము చేసుకోవాలో అర్థం కాక రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల వరి పంట పొలాల్లోనే తడిసిపోయి వరి కోత కోసుకోలేక అల్లాడుతున్నారు. మామిడి పంట తడిసిన పంటను అమ్ముకోవాలంటే దళారులు అతి తక్కువ ధరకు కొనుగోలు చేసే పరి స్థితి, పండించిన పంట చేతికొచ్చే దశలో ఇలా జరగడం రైతన్నకు తీరని నష్టం కలిగిస్తున్నాయి. మామిడి పంట పూత దశలో ఉందని, వర్షం వలన పూత కాయ గాలివానకు రాలిపోయి రైతులను ఆదిలోని దెబ్బతీసిందని, కష్టాల్లో ఉన్న రైతన్నను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. అలాగే ఇటు సూలలు వర్షంతో తడిసి ముద్దాయ్యాయని యజమానులు, కూలీలు వాపోయారు. చాలా నష్టపోయామని వారు వాపోతున్నారు.

## ఇంటిలో పడిన పిడుగు



పిడుగు పాటుకు రంధ్రం పడ్డ ఇంటి శ్లాబ్.

**- తప్పిన పెనుప్రమాదం**
**- గ్రామంలో మోటార్లు, టివిలు దగ్ధం**

వెదురుకుప్పం, మార్చి 19 ప్రభాతవార్త :
మండలంలో పచ్చికాపల్లం పంచాయితీ ఎర్రగుంట గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో ప్రభాకర్ రెడ్డి ఇంటిలో పిడుగు పడింది. ఆ సమయంలో ఇంటిలో ఉన్న వారు బయటికి రావడంతో పెనుప్రమాదం తప్పింది. పిడుగు పాటుకు ఇంటిలో అమర్చిన విద్యుత్ మీటరు, స్విచ్ బోర్డు కాలిపోయాయి. అలాగే గ్రామంలో పదుల సంఖ్యలో టివీలు, ఫ్యాన్లు, వీధిలైట్లు, వ్యవసాయ బావులకు, బోర్లకు అమర్చిన మోటార్లు కాలిపోయినట్లు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. పిడుగు పాటుకు లక్షల రూపాయలు ఆస్తి నష్టం సంభవించిందని ఇంటి యజమాని తెలిపారు. ప్రభుత్వ అధికారులు స్పందించి ఆస్తి నష్టంను అంచనావేసి ప్రభుత్వం ద్వారా బాధితులను ఆదుకోవాలని కోరుతున్నారు. ప్రభాకర్ రెడ్డి కుటుంబ సభ్యులు సురక్షితం కావడంతో అందరు ఊపిరిపీల్చుకున్నారు.

## వెంకటగిరిలో రైతులకు అపార నష్టం



తడిసిన ధాన్యంను ఆర బెట్టుకుంటున్న రైతులు

వెంకటగిరి మార్చి19 ప్రభాతవార్త
గత మూడు రోజుల నుండి అకాల వర్షాలు కురుస్తున్నందు వల్ల రైతులకు అపార నష్టం వాటిల్లింది.ఆదివారం నాడు ఎడ తెరిపి లేకుండా వర్షం పడడంతో కోతకు వచ్చి దన్యాం తడిసి పోయి నష్ట పోయినట్లు రైతులు వాపోయారు.ఒకటి రెండు రోజుల్లో కోతకు వచ్చిన వరిపైరు లోని వడ్లు కయ్యలలోనే రాలి పోయిపోయినట్లు వారు వాపోయారు. తడిన దాన్యం మొులకెత్తినట్లు తెలిపారు.వేలాది ఎకరాల ల్లోని వరిపంటకు అకాల వర్షం నష్టాన్ని కలిగించింది. వెంకటగిరి మండలంలోని కలపాడు,అమ్మపాళెం,కుర్జాగుంట తదితర గ్రామాల్లో వరి పంట వర్షానికి తడిసి పాడయింది.వర్షాలు తగ్గక పోవడంతో దాన్యంను కూడ ఆరబెట్టుకోలేకున్నట్లు రైతులు తెలిపారు.అకాల వర్షాల వల్ల రైతులు అపార నష్టానికి గురవుతున్నారు.

## అధికార పార్టీలో అంతర్మథనం



కోట, మార్చి 19 ప్రభాతవార్త
సాధారణ ఎన్నికల్లో సత్తాచాటాం, స్థానిక సంస్థల ఎన్నికల్లో మాకు ఎదురులేదు. ఇక ఎంఎల్సీ ఒక లెక్కా. పోలింగ్ రోజు దాకా వైసీపీశ్రేణుల ధీమా ఇది. చివరకు ఫలితాల సరళి అధికార పార్టీని ఖంగుతినిపించింది. తూర్పురాయలసీమ ఉపా ధ్యాయ నియోజకవర్గంలో గెలుపు సాధించినా పట్టభద్రుల స్థానంలో ఓటమి ఎదురైంది. పట్ట భద్రులు తమ తీర్పు ఏమిటో వెల్లడించారు. వైసీపీకి సంబంధించి చిత్తూరు జిల్లాలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఒంగోలు జిల్లాలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఈ ఎన్నికలను పర్యవేక్షిం చారు. రాష్ట్రమంత్రి ఆదిమూలపు సురేష్ తన నియోజకవర్గం మార్కాపురానికే పరిమిత మయ్యారు. ఇక్కడ ఓటమి చవిచూడటంతో ఆ ప్రభావం ఆయా జిల్లాల మంత్రులు, శాసనస భ్యులపై పడుతుందనే భావన పార్టీ శ్రేణుల్లో నెలకొంది. లక్షల మంది వినియోగించుకునే పట్టభద్రుల స్థానంలో ఓటమిని తాము జీర్ణించుకోలేకపోతున్నట్లు ఆ పార్టీకి చెందిన కొందరు నాయకులు తెలిపారు. ప్రస్తుతం వారంతా అంతర్మథనంలో పడిపోయారు. రానున్న సాధారణ ఎన్నికల్లోనూ ఎంఎల్సి ఎన్నికల ఫలితాలే వైసీపీకి పునరావృతం అవుతా యని ప్రతిపక్షాలు చెప్తు న్నాయి. సాధారణ ఎన్నికలకు ముందు జరిగిన పట్టభద్రుల ఎంఎల్సి ఎన్నికలకు సెమీ ఫైనల్స్‌గా భావించారు. తిరుపతి జిల్లాలో కొందరు నేతల మధ్య విభేదాలు, వర్గ పోరు ప్రభావం కూడా ఈ ఎన్నికల్లో కనిపించింది. శ్యాంప్రసాద్‌రెడ్డికి మొదటిప్రాధాన్యత ఓటు వేయాలని ఖచ్చితంగా కొంతమందినాయకులు ప్రచారంచేయలేదని ఆ పార్టీవారే ఆరోపిస్తున్నారు.

## విద్యాదీవెన కింద తల్లుల ఖాతాల్లో రూ.20.94 కోట్లు జమ



చిత్తూరు, మార్చి 19 ప్రభాతవార్త:
జగనన్న విద్యాదీవెన నిధులను సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదివారం విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నుండి ఆదివారం సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కి జగనన్న విద్యాదీవెన నిధులను విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన 35,114 మంది విద్యార్థులకు 20.94 కోట్ల రూపాయల నిధులను 31,979 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ అయ్యాయి. ఈ కార్యక్రమానికి చిత్తూరు నుండి డిఆర్‌డిఎ సమావేశపు కాన్ఫరెన్స్ హాలు నుండి వర్చువల్ విధానంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ జగనన్న విద్యాదీవెన పథకం విద్యార్థులకు పూర్తి ఫీజు రీఎంబర్స్ మెంట్ లాంటిదన్నారు. ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి రేపటి సమాజానికి ఉజ్వల భవిష్యత్తు అందించాలని కృషి చేస్తోందన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన మెగా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘీక సంక్షేమ, సాధికారిత అధికారి రాజ్యలక్ష్మి, గిరిజన సంక్షేమ అధికారి మూర్తి, జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి చిన్నారెడ్డి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పంటలు కోల్పోయిన రైతులకు తక్షణం పరిహారం చెల్లించాలి

**ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు - చిత్తూరు జిల్లా కలెక్టర్‌కు లేఖ**

కుప్పం, మార్చి 19 ప్రభాతవార్త
కుప్పం నియోజకవర్గంలో ఇటీవల అకాల వర్షాలతో పంటలు కోల్పోయిన రైతులకు తక్షణం పరిహారం చెల్లించి ఆదుకోవాలని ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. ఈమేరకు ఆదివారం చిత్తూరు జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్‌కు లేఖ రాశారు. కుప్పం నియోజకవర్గంలోని కుప్పం, శాంతిపురం, గుడుపల్లె మండలాల్లో ఇటీవల అకాల వర్షం కురవడంతో పాటు పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వర్షం కురిసిందన్నారు. దీంతో రైతులు సాగు చేస్తున్న వాణిజ్య పంటలపైన టమోటా, బీన్స్, అరటి, క్యాప్సికం తదితర పంటలను తీవ్రంగా నష్టపోయారన్నారు. దాదాపు500- 600 ఎకరాల్లో రైతులకు పంట నష్టం జరిగిందని పేర్కొన్నారు. పంట చేతికి అందే సమయంలో రైతులకు తీరని నష్టం వాటిల్లిందన్నారు. కుప్పం మండలం బిరుదనపల్లి వద్ద మణి, మునిరాజు, గోవిందరాజు, మునస్వామి, రాజు తదితర రైతులకు చెందిన టమోటా పంట బాగా దెబ్బతిందన్నారు. నష్టపోయిన రైతులకు వెంటనే ప్రభుత్వము తరపున పంటనష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని లేఖలో పేర్కొన్నారు. అలాగే కుప్పం మండలం పూరావులబండచేనుకు చెందిన కన్నప్పన యొక్క పూరిగుడిసెపై పిడుగు పడడంతో ఇల్లు దగ్ధమై ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారని, దాదాపు 1.80లక్షల మేర వారికి నష్టం కలిగిందని ప్రభుత్వం తరపున వారికిసైతంపరిహారం చెల్లించి ఆదుకోవాలని లేఖలో పేర్కొన్నారు.

# ఇప్పటి వరకు ఒక లెక్క.. ఇకపై ఓ లెక్క

**- ఎంపిటిసీ ఎన్నికలపై 'దేశం' గురి - ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలతో తెలుగుదేశం శ్రేణుల్లో ఉత్సాహం**

చిత్తూరు, మార్చి 19 ప్రభాతవార్త:
ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీలో నూతన ఉత్సాహం నింపాయి. రెండు రోజుల క్రితం వెల్లడైన ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల్లో మూడు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలను తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు చేజిక్కించుకొని విజయ కేతనం ఎగురవేయడంతో ఆ పార్టీ నాయకులు, శ్రేణుల్లో సంబరాలు చేసుకొంటున్నారు. రాష్ట్రంలో నాలుగేళ్ళ క్రితం అధికారం చేపట్టి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి కొన్ని పత్రికల్లో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే వైఎస్ఆర్ కాంగ్రెస్ భారీ ఓటమి చవిచూడాల్సి వస్తోందని నిత్యం వార్తలు వస్తుండేవి. ఈ పరిస్థితుల్లో గత నాలుగు సంవత్సరాలుగా రాష్ట్రంలో జరిగిన ప్రతి ఎన్నికలోను అధికార వైకాపా విజయం సాధించి ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీకి ఖంగు తినిపించింది. పత్రికల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు వస్తుండటం, ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైకాపా ప్రభుత్వం కూలడం తప్పదని వార్తలు ప్రచురితం అవుతుండటంతో దీనిని నమ్ముకొని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ పార్టీ భవిష్యత్తుపై ఆశలు పెట్టుకొని ఎన్నికల ఫలితాల కోసం వేచి చూసేవారు. అయితే కొన్ని పత్రికల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచురితమైన వార్తలకు, ఎన్నికల ఫలితాలకు పొంతన లేకుండా పోవడంతో ప్రతిపక్ష తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు ఢీలా పడిపోయారు. ఈ నాలుగేళ్ళలో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పంచాయతీ, జడ్పీటిసీ, ఎంపిటిసీ, మున్సిపల్ ఎన్నికలతో పాటు తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల ఫలితాల్లో అధికార వైకాపా ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీని ఢీకొని సునాయాసంగా విజయం సాధించేది. ఈ పరిస్థితుల్లో కొన్ని పత్రికల్లో వస్తున్న వార్తలకు క్షేత్ర స్థాయిలో వుంటున్న వాస్తవాలకు పొంతన లేకుండా పోవడమే అధికార వైకాపాకు అనుకూల ఫలితాలు వస్తున్నాయని తెలుగుదేశం నాయకులు భావించి తమ పార్టీకి మంచి రోజులు ఎప్పుడు వస్తాయో అని ఆలోచిస్తూ మిన్నకుండిపోయేవారు. ఈ క్రమంలో ఇటీవల వెల్లడైన ఎమ్మెల్యే ఎన్నికల ఫలితాలు ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీలో సరికొత్త జోష్‌ను నింపాయి. ఉత్తరాంధ్ర, తూర్పు రాయలసీమ ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు, పశ్చిమ రాయలసీమ అనంతపురం-కడప-కర్నూలు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు అధికార వైకాపా అభ్యర్థులను ఢీకొని విజయం సాధించారు. ఈ నాలుగేళ్ళ కాలంలో అధికార వైకాపాతో ఢీకొని విజయం సాధించిన ఎన్నికలు ఇవి కావడంతో ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీలో కొత్త ఉత్తేజంను నింపాయి. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ రెండవ ప్రాధాన్యత ఓట్లతో సాధించిన విజయం కావడంతో ఇది పెద్ద విషయం కాకపోయినప్పటికీ ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీలో మరింత ఉత్తేజం నింపడానికి ఈ ఫలితాలు ఆ పార్టీకి ఎంతగానే పనికి వస్తాయి. ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలను తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకోవడంతో ఇప్పటికే ఆ పార్టీ నాయకులు జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో సంబరాలు చేసుకొంటున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీకి లభించిన విజయంతో క్షేత్ర స్థాయిలో పార్టీ కార్యకర్తలను మరింత ఉత్తేజపరచి భవిష్యత్తులో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధం చేయాలని పార్టీ అధిష్ఠానం పక్కాగా అడుగులు వేస్తోంది. అలాగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీకి వచ్చిన జోష్‌ను క్షేత్ర స్థాయిలో అలాగే కొనసాగించడానికి పార్టీ నాయకులు ప్రణాళికలు రచించి అమలు చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో మరో వారం రోజుల్లో జిల్లాలో కొన్ని ఎంపిటిసీ స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించడానికి ఎలక్షన్ కమీషనర్ షెడ్యూల్ విడుదల చేయనుంది. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల్లో తెలుగుదేశం పార్టీకి సానుకూలంగా ఫలితాలు వెల్లడి కాకుంటే ఎంపిటిసీ ఉప ఎన్నికలపై సైతం ఆ పార్టీ నాయకులు పెద్దగా ఆసక్తి చూపేవారు కాదు. అయితే ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించి తెలుగుదేశం మంచి జోష్‌లో వుండటంతో త్వరలో జరుగనున్న ఎంపిటిసీ ఉప ఎన్నికల్లో సైతం ఇదే జోష్‌ను కనబరచి ఈ స్థానాలను సైతం కైవసం చేసుకొని ప్రభుత్వంపై ప్రజల్లో మరింత వ్యతిరేకత వుందని నిరూపించాలని పార్టీ నేతలు వ్యూహాలు సిద్ధం చేస్తున్నారు.

## రైస్‌మిల్లుపై విజిలెన్స్ అధికారుల మెరుపుదాడి

**- 8.90లక్షల రేషన్ బియ్యం.. లారీ సీజ్**



కుప్పంరూరల్, మార్చి 19 ప్రభాతవార్త
కుప్పం ప్రాంతంలో గత కొంత కాలంగా అక్రమంగా జరుగుతున్న రేషన్ బియ్యం దందాకు చెక్ పెట్టేలా విజిలెన్స్ అధికారులు చొరవ చూపారు. ఆదివారం భారీ ఎత్తున రేషన్ బియ్యంను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. కుప్పం పట్టణంలోని కమతమూరు మార్గం వద్దగల ఓ ప్రైవేట్ రైస్ మిల్లుపై ఆదివారం విజిలెన్స్ అధికారులు మెరుపుదాడి నిర్వహించారు. ఈసందర్భంగా సుమారు 8.90లక్షల విలువ చేసే 24వేల కిలోల రేషన్‌బియ్యంతో సహా బియ్యాన్ని తరలిస్తున్న లారీని సీజ్ చేశారు. ఈసంఘటనకు సంబంధించి వివరాలిలా.. ఆదివారం ఉదయం విజిలెన్స్‌సిఐలు మల్లికార్జునరావు, శేఖర్‌రెడ్డిలు ఇతర అధికార బృందంతో కలసి ప్రైవేట్ రైస్ మిల్లు వద్దకు చేరుకున్నారు. అక్కడ రేషన్ బియ్యంను పాలీష్ చేసి కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. అప్పటికే అక్కడ అక్రమ రవాణాకు సిద్ధంగా ఉన్న 25వేల కిలోల రేషన్ బియ్యంను అలాగే 8లక్షల విలువ చేసే లారీని సీజ్ చేశారు. ఈ సంఘటనకు సంబంధించి జగదీష్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఈ దాడుల్లో ఎఆర్ఐ విజయ్‌కుమార్, ఎస్సై రామకృష్ణనాయక్, కుప్పం తహశీల్దార్ దేవరాజ్, విఆర్వో కృష్ణమూర్తి, విజిలెన్స్ బృందం పాల్గొన్నారు. కాగా ఈ ప్రైవేట్ రైస్ మిల్లును వి.కోటకు చెందిన ఓ అధికార పార్టీ నాయకుడు సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిసింది.

### ఉష్ణోగ్రతలు
19/3/2023



- తిరుపతి 28 డిగ్రీలు
- చిత్తూరు 30 డిగ్రీలు
- కుప్పం 28 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 29 డిగ్రీలు
- వెంకటగిరి 29 డిగ్రీలు
- గూడూరు 30 డిగ్రీలు

### బంగారం ధరలు
19/3/2023



22 క్యారెట్స్ 1గ్రాము రూ. 5,560
24క్యారెట్స్ 1గ్రాము రూ.6,065

### కోడిగ్రుడ్ల ధరలు
19/3/2023



కోడిగ్రుడ్డు :రూ.6.00
1 డజను: రూ.72.00

## జిల్లా వ్యవసాయాధికారిచే పంటల పరిశీలన

కుప్పంరూరల్, మార్చి 19 ప్రభాతవార్త



మండలంలోని నడిమూరు ఆర్‌బికె పరిధి బిరుదనపల్లి గ్రామంలో ఆదివారం జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ అకాలవర్షంతో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. వడగళ్ల వానతో దెబ్బతిన్న వివిధ రకాల పంటలను పరిశీలించారు. అనంతరం వెండుగంపల్లి, నడిమూరు రైతు భరోసా కేంద్రాల్లో తనిఖీలు చేసి సిబ్బంది పనితీరుపై సమీక్షించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అమృతవల్లి, ఎఇఒలు ఔరంగ్, శివశంకర్, విఎఎలు సౌందర్ నాయక్, కార్తీక్, రైతులు పాల్గొన్నారు.

## వన్నెకుల క్షత్రియులకు పదవులిచ్చింది తెలుగుదేశమే!

తుడా, శ్రీకాళహస్తి మున్సిపల్ ఛైర్మెన్ల పదవులు

శ్రీకాళహస్తి, మార్చి 19 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఆది నుంచి వన్నె కుల క్షత్రియులకు గుర్తించింది పదవుల అవకాశం కల్పించింది తెలుగుదేశం ప్రభుత్వమే అని ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు తెలిపారు. పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ వన్నెకుల క్షత్రియుల ప్రాధాన్యత గుర్తించి శ్రీకాళహస్తి శాసనసభ్యుడుగా సత్రవాడమునిరామయ్యకు అవకాశం కల్పించింది ఎవరని ప్రశ్నించారు. తరువాత ఆయననే తుడా ఛైర్మెన్‌గా నియమించింది ఏ పార్టీ అని ప్రశ్నించారు. కాగా శ్రీకాళహస్తి మున్సిపల్ ఛైర్మెన్‌గా పేట రాధారెడ్డిని వైస్ ఛైర్మెన్‌గా మిన్నల్ రవికి, ఇక కిట్టు మేస్త్రీని టౌన్‌బ్యాంకు వైస్ ఛైర్మెన్‌గా కూర్చొబెట్టింది తెలుగుదేశం పార్టీయే అని ఎవ్వరిని అడిగినా చెబుతారని పేర్కొన్నారు.

**వక్రీకరణతో మభ్యపెట్టలేరు:** ఏర్పేడు మండలంలోని మండల కేంద్రంలో ఎంఎల్‌సి ఎన్నికల్లో తాము దామోదరంపై దాడి చేసి ఉంటే రాజకీయ సన్యాసానికి సిద్ధమని మాజీ వైస్ ఛైర్మెన్ మిన్నల్ రవి ఛాలెంజ్ విసిరారు. ఏర్పేడు పోలింగ్ కేంద్రం వద్ద తెలుగుదేశం ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి దామోదరం రెడ్డిపై దాడి చేసినట్లు ఆరోపించారని అయితే ఆ రోజు దామోదరం రెడిని అన్నా అని సంబోధించినట్లు మాట్లాడినట్లు రికార్డు ఉందన్నారు. అయితే కొందరు వన్నెకుల క్షత్రియులు తెలిసి తెలియకుండా వక్రీకరించి దుష్ప్రచారం చేయటం తగదన్నారు. ఎవరైనా సరే వాస్తవాలు తెలుసుకొని మాట్లాడటం బాగుంటుందన్నారు. శ్రీకాళహస్తిలో మాజీ మున్సిపల్ ఛైర్మెన్ పేట రాధారెడ్డికి సంబంధించి ఆస్తి వివాదంలో వైకాపా నేత చేస్తున్న వివాదాన్ని ఎందుకు ప్రశ్నించలేదన్నారు. వన్నెకుల క్షత్రియుడు పేట బాలాజి రెడ్డి క్రషర్‌ను ఆపేసి రూ.3కోట్లు నష్టం వచ్చినపుడు ఎందుకు న్యాయం అడగలేదని ప్రశ్నించారు. వన్నెకుల క్షత్రియులకు సంబంధించిన తనపై వైకాపా నేతలు ఐదు అక్రమ కేసులు బనాయిస్తే వన్నెకుల క్షత్రియులకు కనబడలేదా? అని మిన్నల్ రవి ప్రశ్నించారు. దివంగత నేత మున్సిపల్ ఛైర్మెన్ రాధారెడ్డి పై దాడి చేస్తే నేడు మాట్లాడే వన్నెకుల క్షత్రియుల నేతలకు కనబడలేదా? తొట్టంబేడు మండలంలో బయ్యారెడ్డిపై వైసిపి నేతలు దాడి చేయటం వాస్తవం కాదా? మరి అప్పుడు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. అందరికి ఒకే న్యాయం ఉండాలని ఏకపక్షంగా మాట్లాడటం వాళ్ళ విజ్ఞతకే వదలిపెడుతున్నామన్నారు. శాసనమండలి సభ్యులు డాక్టర్ సిపాయి సుబ్రమణ్యంను ఎంతో గౌరవిస్తామన్నారు. ఆయన్ను తాను ఏ నాడు విమర్శించలేదని తనపై కొందరు వక్రీకరించి ప్రచారం చేయటం తగదన్నారు. ఈ సమావేశంలో వన్నెకుల క్షత్రియులు పాల్గొన్నారు.

## మోహన్‌బాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కోలా!

శ్రీకాళహస్తి, మార్చి 19 ప్రభాతవార్త



సినీ డైనమిక్ హీరో, నిర్మాత, విద్యా ప్రదాత మాజీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ మంచుమోహన్‌బాబు జన్మదిన సందర్భంగా ఆయన్ను కలసి మాజీ శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ కోలా ఆనంద్‌కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. అంతేకాక ఆయన పేర శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు జరిపించారు. స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను శేష వస్త్రాలను ఆయనకు అందజేసి స్వామి ఆశీస్సులు మీకు అండగా ఉంటాయని వివరించారు. ఆనంద్‌తోపాటు ఆయన అనుచరులున్నారు. తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారికి మిఠాయిలు అందించి ధన్యవాదాలు తెలిపారు.

## కామినాయనిపల్లెలో స్మశాన స్థలవివాదం

-అధికారుల హామీతో సమసిన ఉద్రిక్తత

ఐరాల, మార్చి 19 ప్రభాతవార్త:



స్మశాన స్థలం విషయమై ఇరు గ్రామాల నడుమ వివాదం నేపథ్యంలో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సంఘటన మండలంలోని కామినాయనిపల్లె గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. సంఘటనకు సంభందించి వివరాలిలావున్నియి. కామినాయనిపల్లె దళితవాడ గ్రామస్థులు ఎంతో కాలం నుండి గ్రామ సమీపంలోని స్థలంను స్మశానంగా వినియోగించుకుంటుండేవారు. అయితే ఈభూమి పట్టా భూమి కావడంతో భూయజమాని స్థలాన్ని సర్వే నిర్వహించి పెన్సింగ్ వేసుకున్నారు. దీనితో గత కొంత కాలంగా భూయజమానికి దళితవాడ గ్రామస్థులకు మధ్య వివాదం కొనసాగుతోంది. ఈనేపథ్యంలో శనివారం గ్రామంలోని ఓ వ్యక్తి మృతి చెందడంతో ఈభూమిలో ఖననం చేసేందుకు వస్తారని భూయజమాని ముందుగా అధికారులకు, పోలీసులకు సమాచారం అందించారు. దీనితో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా...స్థానిక తహశీల్దార్ సుశీల, ఎస్సైలు వెంకటేశ్వర్లు, హరి ప్రసాద్, మండల వైకాపా కన్వీనర్ బుజ్జిరెడ్డిలు ఆదివారం గ్రామానికి చేరుకుని ఇరు వర్గాల వారితో చర్చలు జరిపారు. ఈమేరకు గ్రామానికి సంభందించి దళితుల స్మశాన సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది. అనంతరం మృతిచెందిన వ్యక్తి మృతదేహాన్ని మరో చోట ఖననం చేశారు.

## ఎమ్మెల్సీ శ్రీకాంత్‌ను కలిసిన వెదురుకుప్పం టీడీపీ నాయకులు

వెదురుకుప్పం, మార్చి 19 ప్రభాతవార్త :



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిన శ్రీకాంత్‌ను వెదురుకుప్పం తెలుగు దేశం పార్టీ నాయకులు కలిసి ఆదివారం అభినందలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మర్యాద పూర్వకం గా శుభాకాంక్షలు తెలిపారు. అందరి సమిష్టి కృషి, పట్ట భద్రుల ఆశీస్సులతో గెలుపు సాధ్యమయిందని ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు లోకనాథ రెడ్డి, మాజీ మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు బట్టే చాణిక్య ప్రతాప్, గంగాధర నెల్లూరు నియోజకవర్గం మీడియా సమన్వకర్త గురసాల కిషన్ చంద్, రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యదర్శి మునిచంద్రా రెడ్డి, నాయకులు బాబు నాయుడు, సుధార్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు పోలీస్ స్పందన

చిత్తూరు, మార్చి 19 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ప్రతి సోమవారం ఉదయం 10.30 గంటలకు ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పాత జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమం ఈ వారం సైతం నిర్వహించనున్నారు. ప్రజలుతమసమస్యలను ఎస్పీ రిశాంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిం చుకోవచ్చును.

## జనసేన బలోపేతానికి కృషి చేయాలి

కుప్పం, మార్చి 19 ప్రభాతవార్త



కుప్పం నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతానికి కార్యకర్తలు, నేతలు కృషి చేయాలని జనసేన పార్టీ నియోజకవర్గ నేత డా॥ నరేష్ కోరారు. ఆదివారం కమతమూరు మార్గంలో ఉన్న ఎస్‌డిఎం మహల్‌లో ఆ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశంను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు, ఆశయాలను ప్రజల్లో తీసుకెళ్లాలని కార్యకర్తలను కోరారు. అలాగే నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో పార్టీ కేడర్‌ను బలోపేతం చేసే ందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా సుమారు పదిమంది యువత జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. సమావేశానికి జనసేన కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

## పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించిన అంగన్‌వాడీ కార్యకర్తలు

కుప్పం, మార్చి 19 ప్రభాతవారక్త



విజయవాడలో సోమవారం జరిగే రాష్ట్రస్థాయి అంగన్‌వాడీ కార్యకర్తల ధర్నాకు కుప్పం నుంచి ప్రత్యేక బస్సులో బయలుదేరిన అంగన్‌వాడీ ఉద్యోగులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారు కుప్పం పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. తమ డిమాండ్ల సాధనకోసం విజయవాడకు తరలివెళ్తుంటే తమను అడ్డుకోవడం దారుణమన్నారు. ప్రభుత్వ ం వెంటనే తమ డిమాండ్లను పరిష్కరించాలని లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకురాలు ప్రమీల, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## గంగజాతర సంబరాలు ప్రారంభం

సదుం, మార్చి19ప్రభాతవార్త

సదుంలో ఆదివారం ఉదయం నుంచి గంగజాతర సంబరాలు మొదలైనాయి. ఉదయం సదుంలోని నాలుగు వీధులలో ఉన్న గంగరాతి విగ్రహాలకు మహిళలు ప్రత్యేక అలంకరణలతో పూజలు చేశారు. చల్లపోశారు. సాయంత్రం సదుమమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. మారుపొంగళ్లుపెట్టడం, అమ్మవారికి చీరలు పెట్టడం, కోళ్ల వంటివి ఇవ్వడం చేశారు. అదేవిధంగా రెడ్డివారిపల్లె, కంభంవారిపల్లె, బలిజపల్లె, బూరగమంద, ఊటుపల్లె, పంచాయతీలోని చల్లావారిపల్లె, బొమ్మిరెడ్డిగారిపల్లె, పాలమందలలో గ్రామ దేవతలను మహిళలు పూజించారు. సదుంలో గాంధీరోడ్డులోని వీదులను విద్యుద్దీపాలతో అలంకరించారు. పాలమందలో జరిగిన జాతరలో జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి, మాజీఎంపీపీ ఇందిరమ్మ, జడ్పీటీసీ సోమశేఖరరెడ్డిలు, తదితరులు పాల్గొని పూజలు చేశారు. సిలింకూరి యల్లమ్మ తల్లి ఆలయం వద్ద ఉదయం మహిళలు బోనాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. సదుం ఎస్సై మారుతి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో నిర్వహిస్తున్న గంగజాతరలకు బందోబస్తు నిర్వహిస్తున్నామని చెప్పారు. జాతర సందర్భంగా మహిళలతో అమర్యాదగా ప్రవర్తించడం వంటి పనులు చేయరాదన్నారు. పోకిరి పనులు చేయరాదని చెప్పారు. అందరు సఖ్యతగా పండుగను మంచి వాతావరణంలో జరుపుకోవాలని"

## 22న కాణిపాకంలో ఉగాది వేడుకలు

కాణిపాకం, మార్చి 19 ప్రభాతవార్త:

శ్రీశోభకృత్ నామ సంవత్సరం ఉగాది వేడుకలను ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం ఆలయంలో ఈనెల 22న అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశులు తెలిపారు. ఈసందర్భంగా ప్రధాన ఆలయంలో ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయంలోని అలంకార మండపం వద్ద స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వుంచి ప్రత్యేకపూజలు నిర్వహించిన 9 గంటల నుండి 10 గంటల వరకు పండితులచే పంచాంగ శ్రవణమును కార్యక్రమంను నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈకార్యక్రమంలో భక్తులు, పరిసర గ్రామాల ప్రజలు ఎద్దఎత్తున పాల్గొని ఉగాది పచ్చడిని స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

## సత్వరం జిఓనెం.1 రద్దుకు చర్యలు

- టుటౌన్ ఎస్ఐ మల్లికార్జున్‌కు సిపిఐ నాయకుడు నాగరాజు వినతి

చిత్తూరు, మార్చి 19 ప్రభాతవార్త:



ప్రతిపక్ష పార్టీలు రోడ్‌షోలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం జారీ చేసిన జిఓనెం.1ను సత్వరం ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం టుటౌన్ ఎస్ఐ మల్లికార్జున్‌కు జిల్లా సిపిఐ కార్యదర్శి నాగరాజు వినతిపత్రం అందజేశారు. విజయవాడలో సోమవారం జరిగే కార్యక్రమానికి సిపిఐ నాయకులు, కార్యకర్తలు ఎవ్వరు తరలి వెళ్ళకుండా పోలీసులు వారికి నోటీసులు జారీ చేశారు. దీనిపై సిపిఐ నాయకులు, కార్యకర్తలు సమావేశమై మాట్లాడుతూ ప్రభుత్వం బ్రిటీష్ కాలం నాటి జిఓను వెలుగులోకి తీసుకువచ్చి అమలు చేయడం అన్యాయమని ఆరోపించారు. ప్రతిపక్షాల గొంతు నొక్కడానికే ప్రభుత్వం ఇలాంటి జిఓలను విడుదల చేస్తోందని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో నాయకులు మణి, జయలక్ష్మి, గౌరి పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ స్థానాల విజయంపై 'దేశం' ర్యాలీ

**బంగారుపాళ్యం, మార్చి 19 ప్రభాతవార్త:** రాష్ట్రంలో జరిగిన మూడు పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో తెలుగుదేశం మద్దతుతో ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు గెలుపొందడంతో ఆదివారం బంగారుపాళ్యంలో తెలుగుదేశం నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున బాణాసంచా పేల్చుతూ పార్టీ కార్యాలయం నుండి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా దేశం అధ్యక్ష, కార్యదర్శులు జయప్రకాష్, జనార్దన్‌గౌడులు మాట్లాడుతూ పట్టభద్రులు విజ్ఞతతో తెలుగుదేశంకు మద్దతు పలికి విజయం సాధించేలా కృషి చేశారన్నారు. ఇలాగే 2024 సంవత్సరంలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో సైతం తెలుగుదేశం విజయం సాధించి సిఎంగా చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టనున్నారని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దేశం నాయకులు కోకా ప్రకాష్‌నాయుడు, భాష్యం వంశీకృష్ణ, రఘుపతి, కలమనాధరెడ్డి, హేమచంద్రనాయుడు, కవి, రమేష్, గిరిబాబు, ధరణినాయుడు, లోకనాధనాయుడు, రాజేంద్రనాయుడు, దేవయాని, కుమారి తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## మేరిగ మురళికి అభినందనలు

కోట, మార్చి 19 ప్రభాతవార్త



ఎంఎల్‌సి మేరిగ మురళీధర్ ఆత్మీయ సమావేశం గూడూరులో జరిగింది. ఈ ఆత్మీయ సమావేశానికి ర్యాలీకి కోట మండలం నుంచి ఆదివారం వైసీపీ నాయకులు, కార్యకర్తలు వివిధ వాహనాల్లో భారీగా తరలి వెళ్లారు. కోట, కొత్తపాలెం, విద్యానగర్, చిట్టేడు, కేశవరం తదితర గ్రామాల నుంచి వైసీపీ నాయకులు వెళ్లారు. ఈ సందర్భంగా చిట్టేడు సొసైటీ ఛైర్మన్ ఉలవకాయల ప్రసాద్ మాట్లాడుతూ మేరిగ మురళీధర్ పార్టీ కోసం కష్టపడి పనిచేసి జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా, గత అసెంబ్లీ ఎన్నికల్లో గూడూరు నియోజకవర్గానికి సమన్వయకర్తగా పనిచేసి పార్టీకి విధేయుడిగా ఉండటంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తించి ఎంఎల్‌సి పదవి ఇచ్చారని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజా సమస్యలపై అవగాహన కలిగిన విలక్షణ నేత మేరిగ మురళీధర్ అని అన్నారు. ఈ ర్యాలీలో కేశవరం వైసీపీ నాయకులు గురుస్వామి, విగ్రహాల రఘురామయ్య, మహీదర్ తదితరులు ఉన్నారు.

## విజయ స్ఫూర్తితో పనిచేస్తాం

- మాజీ ఎంపి నెలవల సుబ్రహ్మణ్యం

సూళ్లూరుపేట, మార్చి 19 ప్రభాతవార్త



ఎంఎల్‌సి ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించి అదే విజయ స్ఫూర్తితో పనిచేసి పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, తిరుపతి పార్లమెంటరీ పార్టీ ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డిలు అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, మండల పార్టీ నేతలు, బూత్ ఏజెంట్లు ప్రత్యేక సన్మాన సభలో వారు పాల్గొన్నారు. ఎంఎల్‌సీ ఎన్నికల్లో పార్టీ అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహించి మంచి మెజార్టీ తీసుకొచ్చేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో అధికార పార్టీ ఒక వైపు అనేక రకాలుగా ఒత్తిళ్లు చేస్తున్నప్పటికీ ప్రతి కార్యకర్త ధైర్యంగా ముందుకొచ్చి పార్టీ మద్దతు పలికిన అభ్యర్థికి ఓట్లు వేయించారని అన్నారు. ప్రస్తుతం ఈ ఎన్నికల్లో గెలిచామన్నది సంతోషం కాదని, 2024 శాసనసభ ఎన్నికలను లక్ష్యంగా పెట్టుకొని పనిచేయాలని నేతలు కోరారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో బోగస్ ఓట్లను ఏరివేయడంలో చాలావరకు కార్యకర్తలు కష్టపడ్డారని అన్నారు. ఇప్పటి నుంచే ప్రణాళిక రూపొందించుకొని దొంగ ఓట్లను వెరిఫికేషన్ చేసి, వాటిని ఓటర్ల జాబితా నుంచి తొలగింపచేసేందుకు పార్టీ ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం పనిచేయాలని నెలవల సుబ్రహ్మణ్యం, వేనాటి సతీష్‌రెడ్డిలు సూచించారు. 2024 ఎన్నికల్లో అధికార పార్టీ వివిధ రకాలుగా ఒత్తిళ్లు, అధికార దర్పాన్ని చూపించే అవకాశాలు ఉన్నాయని, దాన్ని దృష్టిలో ఉంచుకొని ఇప్పటినుంచే మానసికంగా కార్యకర్తలు, పార్టీ నేతలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాలకు సంబంధించి పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. అలాగే బూత్ కన్వీనర్లు, ఏజెంట్లు, మండల పార్టీ నేతలకు ప్రత్యేకంగా సన్మానించి మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, వేనాటి జనార్దన్‌రెడ్డి, కొక్కు శంకరయ్య, ఆకుతోట రమేష్, బొమ్మన్ శ్రీధర్, ఏజి కిషోర్, ఎం.శ్రీహరిరెడ్డి, పి.శ్రీనివాసులు, వి.శ్రీనివాసులునాయుడు, పెంచలయ్య, బుద్ధి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## అకాలవర్షంతో నష్టపోయిన రైతులు

దొరవారిసత్రం, మార్చి 19 ప్రభాతవార్త



దొరవారిసత్రం మండల పరిధిలో ఉరుములు మెరుపులతో అకాలవర్షం కురవడంతో అన్నదాతలు అతలాకతలం అయ్యారు. రెండురోజులు నుంచి ఎడతెరిపి లేని వర్షం కురుస్తుండటంతో వరి, మిరప, మామిడి తదితర ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. రైతులకు శోకం మిగిల్చింది. సాధారణంగా మార్చి నెలలో వర్షం రాదు. కానీ ఒక్కసారిగా గాలివాన ఉరుములు మెరుపులతో వర్షం రైతులకు శాపంగా మారింది. దీనికితోడు గ్రామాల్లోని మట్టి రోడ్లు బురదమయంగా మారాయి. ఎక్కువగా మామిడిచెట్లు పూత రాలిపోయి కాసిన కొద్దిపాటి పిందె గాలులకు నేల రాలి రైతులు దిగాలు పడుతున్నారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

## 2024 ఎన్నికల్లో టీడీపీ విజయం తధ్యం

- రాష్ట్ర తెలుగు మహిళా కార్యదర్శి గుండాల లీలావతి

గూడూరు, మార్చి 19 ప్రభాతవార్త



తూర్పురాయలసీ, పశ్చిమ, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను గెలిపించిన పట్టభద్రులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలుగు మహిళా రాష్ట్ర కార్యదర్శి గుండాల లీలావతి తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను పట్టభద్రులు బయటపెట్టారని చెప్పారు. ఇది ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతకు నిదర్శనమని చెప్పారు. యువత నిజాయితీగా తమ ఓటుతో ప్రభుత్వంపై తిరుగుబాటు చేశారని, అక్రమాలు, దాడులు, కేసులతో భయపెడితే, పట్టభద్రులు ఓటుతో వైసీపీకి చెమటలు పట్టించారని వివరించారు. టీడీపీ గెలుపునకు కృషి చేసిన నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం

గూడూరు, మార్చి 19 ప్రభాతవార్త



గూడూరులోని డాక్టర్ ఎస్‌విఎస్ ప్రసాద్ భవనంలో ఆదివారం తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి గూడూరు సిపిఎం సెంటర్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు టి.వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ కామ్రేడ్ మల్లు స్వరాజ్యం బాల్యం నుంచే పేదల సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారన్నారు. తన కుటుంబంలోని పెత్తందారి పోకడలకు ఎదురొడ్డి నిలిచిందని, తన అన్న భీమిరెడ్డి నరసింహారెడ్డితో కలిసి ఆంధ్రా మహాసభ కార్యక్రమాల్లో, అనంతరం జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలోనూ పాల్గొన్నారని తెలియజేశారు. గత ఏడాది మార్చి 19వ తేదీన ఆమె మరణించారని, అప్పటికి ఆమె వయస్సు 91 సంవత్సరాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.రాజా, బివి రమణయ్య, బి.పెంచలప్రసాద్, బి.గోపీనాథ్, జి.శివయ్య, పిపిఎస్ సురేష్, పి.మణి, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## అర్చకులు, పురోహితులకు ఉగాది కానుక పంపిణీ

వాకాడు, మార్చి 19, ప్రభాతవార్త



వాకాడు మండలం బాలిరెడ్డి పాలెం గ్రామంలో వెలసియున్న శ్రీపట్టాభిరామాలయంలో శ్రీసీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం తెలుగు సంవత్సరాది ఉగాదిని పురస్కరించుకుని ప్రవాస భారతీయులు రామిరెడ్డి వెంకటరామిరెడ్డి, హైమావతమ్మ దంపతులు వారి కుమారుడు మధు కిరణ్ రెడ్డి కుమార్తె లావణ్యల ఆర్థిక సహకారంతో 55 కుటుంబాలకు ఒక లక్ష 50 వేల రూపాయిలు విలువ గల ఫలసరుకులు, కూరగాయలు, వస్త్రములు కొరకు సంభావన అందజేశారు. ఈ కార్యక్రమంలో కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, ఓజిలి, నాయుడు పేట, గూడూరు మండలాలకు చెందిన 150 పైగా అర్చకులు, పురోహితులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా వాకాడు సొసైటీ ఛైర్మన్ కొడవలూరు దామోదర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ హిందూ సమాజానికి ధార్మికత ఎంత అవసరం ఉందని అదే స్థాయిలో అర్చకులు, పురోహితుల అవసరం కూడా ఉందని, వారికి వస్తున్న జీతభత్యాలను చూస్తే చాలా కుటుంబాలు దయనీయ పరిస్థితుల్లో ఉన్నాయని, వాటిని గమనించి దాతలు ముందుకు వచ్చి ఇటువంటి సత్కార్యాలను చేయడం ఎంతో సంతోషకరమని అన్నారు. ఈ సందర్భంగా దాతలకు అభినందనలు తెలియజేసారు. అనంతరం సంస్థ ప్రతినిధి దీవి అనంతబాబు మాట్లాడుతూ అర్చకులు, పురోహితులు అతి తక్కువ జీతాలతో జీవితాలను కొనసాగిస్తున్నారని, అటువంటి వారికి ఎంతో కొంత సాయం చేయాలనే సదుద్దేశంతో దాతలు ముందుకు వచ్చి ఇటువంటి కార్యక్రమాలను ప్రోత్సహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. దాతల సహకారంతో మునుముందు మరెన్నో కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలియజేసారు. శ్రీరామసేన అధ్యక్ష కార్యదర్శులు హరీష్ రెడ్డి, శివకుమార్, ప్రతినిధులు నరేష్ శర్మ, శేషాద్రి శర్మ, సుబ్రహ్మణ్య శర్మ, యుగంధర్, రూపేష్, చలపతి, కార్తీక్, శివ, తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్‌కు అభినందనలు

గూడూరు, మార్చి 19 ప్రభాతవార్త

తూర్పురాయలసీమ పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో గెలుపొందిన కంచర్ల శ్రీకాంత్‌ను మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆదివారం కలిసి అబినందనలు తెలిపారు. భవిష్యత్‌కు ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ విసయం తెలుగుదేశం పార్టీ 2024 ఎన్నికల్లో గెలుపొందడానికి నాందిగా అభివర్ణించారు. ఆయన వెంట మాజీ మంత్రి పరసా రత్నం, సతీష్‌చంద్ర, జిల్లా అధికార ప్రతినిధి బిల్లు చెంచురామయ్య, నటశేఖర్, నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షుడు ఎండి అబ్దుల్ రహీమ్, పట్టణ బిసి ఉపాధ్యక్షులు హరిబాబు, చిట్టమూరు మండల ప్రధాన కార్యదర్శి చిన్నారావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా శ్రేణుల్లో రెట్టింపు ఉత్సాహం

కోట, మార్చి 19, ప్రభాతవార్త



ఎమ్మెల్సీగా మేరిగ మురళీధర్ బాధ్యతలు చేపట్టి గూడూరుకు రావడంతో ఆయనకు స్వాగతం పలికేందుకు కోట మండలం నుంచి భారీ స్థాయిలో ద్విచక్రవాహనాల్లో , కార్లు, వ్యాన్లులో వైకాపా కార్యకర్తలు, నాయకులు గూడూరుకు తరలి వెళ్లారు. మేరిగ మురళీధర్‌కు అపూర్వ స్వాగతం పలికారు. రెట్టింపు ఉత్సాహంతో వైకాపా శ్రేణుల్లో ఆనందం వెల్లువెత్తింది. పలువురు నాయకులు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పని చేసే వారికి సిఎం జగన్‌మోహన్ రెడ్డి సరైన గుర్తింపు ఇచ్చారని చెప్పారు. ఈ ఆత్మీయ సమావేశానికి కోట, విద్యా నగర్, చిట్టేడు, కేశవరం గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. వైసిపి రాష్ట్ర జాయింట్ సెక్రటరీ నల్లపరెడ్డి కుమార్ రెడ్డి చిట్టేడు సొసైటీ ఛైర్మన్ ఉలవకాయల ప్రసాద్, గురుస్వామి, నాగూర్ రెడ్డి, జయచంద్ర రెడ్డి, రామచంద్రారెడ్డి, మహిధర్, శ్రీనివాసులు, హరికృష్ణ, వేమసాని నరేష్ నాయుడు, వేణయ్య, జి. కోటేశ్వర నాయుడు తదితరులు వెళ్లారు.

## విద్యార్ధులకు విద్యాసామగ్రి పంపిణీ

చిల్లకూరు మార్చి 19 ప్రభాతవార్త



చిల్లకూరు గ్రామంలో ఏర్పాటు అయి వున్న డానియల్ చిల్డ్రన్ హోం నందు అనాధాశ్రమ విద్యార్ధులు విద్యాసామగ్రిని ఆదివారం జిందాల్ పరిశ్రమలో పనిచేస్తున్న సుల్తాన్ అహ్మద్ మంచూర్యా చేతులు మీద అందించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతు జిందాల్ స్టీల్ పరి శ్రమ ఛైర్‌పర్సన్ సావిత్రి జిందాల్ జన్మదినం సందర్బంగా ఆశ్రమంలో చదివిని పిల్లలకు విద్యాసామాగ్రితోపాటు మధ్యహ్నం నాణ్యమైన బోజనం అందించడం జరిగిందని అన్నారు. జిందాల్ సావిత్రి పుట్టిరోజు సందర్భంగా వారం రోజులు అనాధలకు వివిధ రకాల సేవా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని అన్నారు. విద్యార్ధులు కష్టపడి చదివితే ఎంతో ఉన్నత మైన స్దానానికి ఎదగవచ్చునని అన్నారు. జిందాల పరిశ్రమ ద్వారా పేద విద్యార్ధులకు ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో కంపెనీ ప్రతినిదులు దిలీప్‌కుమార్ పాఠక్, బోబిన్‌మాథ్యూ, శివాజీ రేస్ స్కూల్ కరస్పాండెంట్ బాలచెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## పులికాట్ జాలర్ల కుప్పాల సమస్యలు పరిష్కరించండి

-మంత్రి సీదిరి అప్పలరాజుకు వినతి

తడ, మార్చి 19 ప్రభాతవార్త

తడ మండలంలోని 17 కుప్పాలలో నివసిస్తున్న పులికాట్ జాలర్ల సమస్యలను పరిష్కరించాలని ఆదివారం మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజుకు విజ్ఞప్తి చేశారు. తాడేపల్లిలోని అసెంబ్లీ లాబీ వద్ద సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యతో కలిసి తడ నాయకులు మంత్రి అప్పలరాజుకు తమ సమస్యలు తెలియజేశారు. బోటు డీజిల్‌పై ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ కోసం ఇక్కడికి దూరంగా ఉన్న



వాకాడు మండలం దాకా వెళ్లాల్సి వస్తుందని, ఆ సబ్సిడీని తడ మండలంలోని పెట్రోలు బంకులకు వర్తింపచేయాలని చెప్పారు. తడ మండల అధ్యక్షుడు కొళవి రఘురెడ్డి, ఉపాధ్యక్షులు కుప్పంపాటి వెంకటేష్, చిన్నప్పన్ రమేష్, ఇరకందీవికి చెందిన గుణశేఖర్, వినోద్ తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

## 'పట్టభద్రుడు' అంగట్లో సరుకు కాదు

–డాక్టర్ ఉమేష్‌రావు

.శ్రీకాళహస్తి, మార్చి 19 ప్రభాతవార్త

అరాచక రాజకీయాలకు, ఆర్థిక నేరాలకు అలవాటుపడిన జగన్‌మోహన్‌రెడ్డి తన అధికార బలాన్ని ప్రయోగించి ఎంఎల్‌సి ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని ప్రలోభాలతో లోబరచుకోవడానికి పట్టభద్రుడు అంగట్లో సరుకు కాదని తెలుగునాడు విద్యార్థి సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి మరియు బిసి వెల్ఫేర్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్‌రావు పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావంతులు మరియు వివిధ రంగాల్లో నిష్ణాతులైన విశిష్ట వ్యక్తుల చేత దిగువ సభలో కొరవడిన చర్చను మరింత మెరుగ్గా కూలంకషంగా చర్చించడానికి ఉపయోగపడుతూ వచ్చిన ఎగువసభను అరాచకశక్తులతో, అక్రమార్కులతో నింపేందుకు ప్రయత్నించిన జగన్‌మోహన్‌రెడ్డి మరియు పట్టభద్రులకు రాష్ట్రంలోని ప్రజాస్వామ్యవాదులంతా వేల వందనాలు సమర్పిస్తున్నారని ఉమేష్ పేర్కొన్నారు. కనీస అక్షర జ్ఞానం లేని వారికి పట్టభద్రులకు సమానంగా ఓటుహక్కు కల్పించి భారతీయ సమాజంలో రాష్ట్ర ప్రజానీకానికి తలవంపులు తేవడంలో పాత్రధారులైన ప్రతి ఒక్క అధికారిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి, అక్రమార్కులపై చర్యలుతీసుకోవాలని ఉమేష్ డిమాండ్ చేశారు.

## అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

శ్రీకాళహస్తి, మార్చి 19 ప్రభాతవార్త



అఖిలగాండ్ల తెలికుల సంక్షేమ సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం రాష్ట్ర అధ్యక్షుడు గ్రోసు సుబ్బారావు, ఎన్నికల పరిశీలకులు నరవఅనంతం మరియు కోర్ కమిటీ సమక్షంలో ఎన్నుకున్నారు. తిరుపతి జిల్లా గాండ్ల సంక్షేమ సంఘ అధ్యక్షులుగా నాయుడుపేటకు చెందిన నెల్లూరు నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా తిరుపతికి చెందిన బండారు శ్రీనివాసులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణానికి చెందిన బిఆర్ రాజేంద్రప్రసాద్‌ను ఉపాధ్యక్షుడుగా, ట్రెజరర్‌గా ఓ.గిరిధర్, సంయుక్త కార్యదర్శులుగా వంకాయల సిద్దులయ్య, నెమళ్ళూరుసుబ్రమణ్యం(బుజ్జి), ఆర్కాటు చెంచయ్య, సభ్యులుగా మునిగోపాల్, సుబ్రమణ్యం, ఆర్మొగంలను ఎన్నుకున్నారు. అలాగే తిరుపతి జిల్లా యువత అధ్యక్షులుగా బిఆర్.భరత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలోశ్రీకాళహస్తి పట్టణానికి చెందిన కన్నావరంశరవణకుమార్, రాష్ట్ర ఈసి సభ్యులుగా హరిబాబులును ఎన్నుకున్నారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గానికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## నోటీసులు ఇవ్వడం అప్రజాస్వామ్యమే

.తొట్టంబేడు, మార్చి 19 ప్రభాతవార్త



ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి గుద్లూరుభారతీకి పోలీసులు నోటీసులు ఇవ్వడం సమంజసం కాదని ఐఎఫ్‌టియు తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లిసుబ్రమణ్యం ఖండించారు. అంగన్‌వాడీ నాయకురాలుగా ఉన్న భారతీకి టుటౌన్ పోలీసులు నోటీసులు జారీచేయడంపై మండిపడ్డారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటివద్దకు వెళ్ళి నోటీసులు ఇవ్వడాన్ని అప్రజాస్వామిక చర్యగా పేర్కొనడంతో పాటు ఇచ్చిన నోటీసును వెనక్కుతీసుకోవాలని డిమాండ్ చేశారు. భారతదేశ ప్రజలకు రాజ్యాంగం కొన్ని మౌళిక సౌకర్యాలు, సదుపాయాలు కల్పించిందని పాలన వ్యవస్థ గాడితప్పినపుడుప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు రాజ్యాంగం కల్పించినటువంటి భావస్వేచ్ఛహక్కు అని తమ హక్కులకోసం ఉద్యమిస్తున్న వారికి ఇచ్చిన నోటీసులు వెనక్కితీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్మికుల సమస్యలకోసం ఛలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తే నాయకుల ఇండ్లకు వెళ్ళి ముందస్తు నోటీసులు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు.

## అక్రమ అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరు..సిపిఐ

శ్రీకాళహస్తి, మార్చి 19 ప్రభాతవార్త



జివో నంబర్ 1ని రద్దు చేయాలని సిపిఐ పార్టీ రేపు ఛలో అసెంబ్లీ కార్యక్రమానికి పిలుపు మేరకు విజయవాడకు బయలుదేరుతున్న సిపిఐ పార్టీ నాయకులను ఇళ్ళ దగ్గరనుంచి అప్రజాస్వామికంగా అరెస్టులు చేసి అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా నియోజకవర్గం కార్యదర్శి జనమాలగురవయ్య మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో ఉద్యమాలను అపలేరని రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశ దోరణి విడవకుంటే గతంలో తెలుగుదేశం ప్రభుత్వంకి పట్టినగతే ఈ ప్రభుత్వానికి పడుతుందన్నారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి గోపి, సివిల్ సప్లయిస్ జిల్లా అధ్యక్షులు అయ్యప్ప, ఆటోయూనియన్ నాయకులు ధన, ధర్మేంద్ర, ఎఐవైఎఫ్ నాయకులు నవీన్, మునిరాజ, వీధి వ్యాపారుల నాయకులు మురళీ, పట్టణ నాయకులు గణేష్, రుక్కు, బాబురాజ్, సిపిఐ పార్టీ జిల్లా సమితి సభ్యులు కత్తిధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాములోరి గుడి కాడ సెత్త సెదారం ఎంటబ్బా!

శ్రీకాళహస్తి,మార్చి 19 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలోని బిసి అగ్రహారం మలుపు వద్ద ఓ వైపు రాములోరి గుడి మరో వైపు నవగ్రహాల గుడి మధ్యలో దారి ఉంది. అయితే గతంలో ఎన్నడూలేని విధంగా ప్రస్తుతం ఇక్కడ ఓ చెత్త కుప్ప వెలిసిందని భక్తులు ముక్కులు మూసుకొని పోతున్నారు. అయితే ఈ చెత్తలు ఎవరు వేస్తున్నారు? ఎందుకు వేస్తున్నారు? మరి మున్సిపాలిటి ఏం చేస్తుందనే చర్చ చోటు చేసుకుంది, పవిత్ర మైన ఆలయాలకు నిత్యం భక్తులు వస్తుంటారు. ముఖ్యంగా నవగ్రహాల గుడికి ఎప్పుడూ పట్టణం నుంచే కాకుండా బయటి ప్రాంతాల వారు కూడా వస్తుంటారు. ఇక్కడ చెత్తలతో దుర్గంధం చోటు చేసుకుంది. ఆలయాలకు వచ్చే వారే కాకుండా దారిన పోయే వారు కూడా ముక్కులు మూసుకొని వెళుతున్నారు. ఈ మార్గంలో ఎందరో అధికారులకు కూడా వెళుతుంటారు. దారి మధ్యలో చెత్త కుప్ప గురించి ఎందుకు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకురావటం లేదని చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి ఇక్కడ చెత్త కుండీ ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

## మృతులకు నివాళులు-ఆర్థికసాయం

శ్రీకాళహస్తిరూరల్, మార్చి 19 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలం టిడిపి నాయకులు చల్లపాలెం భక్తిరెడ్డి అన్న వంకాయలపాటి చెంగల్‌రాయలురెడ్డి ఇటీవల స్వర్గస్తులయ్యారు. దీంతో వారి కుటుంబానికి వెళ్ళి కుటుంబసభ్యులను పరామర్శించి వారు అండగా ఉంటామని భరోసా కల్పించారు. అనంతరం అక్కుర్తి హరిజన వాడలో క్యాన్సర్ వ్యాధిలో బాధపడుతున్న గౌరమ్మ కుటుంబానికి రూ.20వేలు ఆర్థికసాయం అందించి అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఏర్పేడు మండలం ఎండిపుత్తూరు గ్రామంలోని వెంకటసుబ్బమ్మ ఇటీవల మృతిచెందింది దీంతో సుధీర్‌రెడ్డి వారి స్వగృహానికి చేరుకున వెంకటసుబ్బమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

## ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

–లేని పక్షంలో రానున్న ఎన్నికల్లో గుణపాఠం చెబుతాం

–ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాయపనేని హరికృష్ణ

తిరుపతి ప్రెస్‌క్లబ్,మార్చి 19 ప్రభాతవార్త:



ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, లేని పక్షంలో రానున్న 2024 ఎన్నికల్లో వైసిపికి సరైన గుణపాఠం చెబుతామని ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాయపనేని హరికృష్ణ హెచ్చరించారు. ఆదివారం స్థానిక నారాయణ పురంలోని ఐఎఫ్‌టియు కార్యాలయంలో చిత్తూరు,తిరుపతి,అన్నమయ్య జిల్లాల ముఖ్య ఆశా వర్కర్ల సమావేశం జరిగింది.ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ ఆశా వర్కర్లను నిర్బంధ కార్మికులుగా మార్చి వారికి సంబంధం లేని పనులతో వేధించడం దారుణమన్నారు.గతేడాది డిఎంహెచ్ ఓగా ఉన్న డా॥శ్రీహరి ఆవా వర్కర్ల విధులకు సంబంధించి స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు.అయితే కొందరు మెడికల్ ఆఫీసర్లు,సూపర్‌వైజర్లు,నోడల్ ఆఫీసర్లు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ,ఆశా వర్కర్లను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు.ఆశ వర్కర్ల చేత ఫీవర్,లెప్రసీ సర్వేలు,గర్భిణీలకు సంబంధించిన సర్వేలు చేయించడం,వ్యాక్సిన్ క్యారియర్లు మోయించడం జరుగుతోందన్నారు.విధులకు సరిగా హాజరుకాని కొందరు ఏఎన్ఎంలు సైతం ఆశ వర్కర్లపై పెత్తనం చేస్తూ,తాము చేయాల్సిన పనులను కూడా వారితో చేయిస్తున్నారని దుయ్యబట్టారు.ఆశాలు సచివాలయా లకు వెళ్లాల్సిన అవసరం లేదని,ఈ విషయంలో ప్రభుత్వం స్పందించి న్యాయం చేయకుంటే..ఆశ వర్కర్లు రానున్న ఎన్నికల్లో తమ సత్తా ఏంటో చూపిస్తారని హెచ్చరించారు.అనంతరం ఆశ వర్కర్స్ ఫెడరేషన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జె.గంగాదేవి మాట్లాడుతూ ఆశ వర్కర్లకు ప్రభుత్వం అందిస్తున్న వైఎస్ఆర్ ఆసరా,వికలాంగ,వితంతు పెన్షన్లను రద్దు చేశారని,వెంటనే వాటిని కొనసాగించాలని ఆమె డిమాండ్ చేశారు.ఆశా వర్కర్లు అంటే అఫ్‌ట్రాల్ అనడం కొందరు అధికారులకు అలవాటుగా మారిందని,ఇప్పటికైనా వారి తీరు మార్చుకోవాలని ఆమె హితవు పలికారు.ఆశా డే రోజున పిహెచ్‌సిలో కుర్చీలు ఏర్పాటు చేసినిర్వహించాలని,వర్కర్లకు 6 నెలలు ప్రసూతి సెలవులు ఇవ్వాలని, 45 సం॥లు పైబడిన వారికి మెడికల్ లీవులు ఇవ్వాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు.అలాగే ఆశా వర్కర్లకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని,పిఎఫ్,ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కోశాధికారి సురేఖ,తిరుపతి నగర అధ్యక్షురాలు లక్ష్మీ కళ,ఉమ్మడి జిల్లాలముఖ్య ఆశావ ర్కర్లువిమల, రమణిలతకిరణ్‌కుమారి,సుభాషిణి,జ్యోతి,హిమబిందు,శ్రీదేవి,రజియా,పద్మావతిపాల్గొన్నారు.

## మల్లంగుంటలో టిడిపి శ్రేణులు సంబరాలు

–అధ్యక్షుడు దిలీప్‌యాదవ్ అధ్యక్షతన కేక్ కటింగ్

తిరుపతిరూరల్, మార్చి19 ప్రభాతవార్త:



తూర్పు రాయలసీమ పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికలలో అఖండ మెజార్టీతో గెలుపొందిన కంచర్ల శ్రీకాంత్ గెలుపును హర్షిస్తూ మల్లంగుంటలో టిడిపి శ్రేణులు పండగ వాతావరణంలో సంబరాలలు జరుపుకున్నారు. తిరుపతిరూరల్ మండలం మల్లంగుంట గ్రామ పంచాయతీ టిడిపి అధ్యక్షుడు అవిలాల దిలీప్‌యాదవ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున బాణా సంచాలు పేల్చడంతో పాటు కేక్ కట్ చేసి విజయోత్సవ సంబరాలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో దిలీప్ యాదవ్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలలో వైకాపా గెలుపు కోసం ఎన్నికుట్రలు, కుతంత్రాలు పన్నినా....దొంగ ఓట్ల వేయించిన గెలుపు మాత్రం టిడిపికే దక్కిందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో తూర్పు రాయలసీమ నుండి కంచర్ల శ్రీకాంత్, పశ్చిమ రాయలసీమ నుంచి భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, ఉత్తరాంధ్ర నుండి వేపాడు చిరంజీవి రావు గెలుపే టిడిపి పునర్ వైభవ నాందికి నిదర్శనమని పేర్కొన్నారు.టిడిపి శ్రేణులు మస్తాన్ సాహెబ్, నాగేశ్వరరావు, వెంకటేష్, మణికంఠ, దామోదరం, సురేష్, చైతన్య, వెంకటముని, సారయ్య, కార్తీక్, అమీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రులు ప్రజాస్వామ్య పాలన కోరుకున్నారు

చుక్కా ధనంజయ యాదవ్

విజయపురం, మార్చి 19 ప్రభాతవార్త :



పట్టభద్రులు ప్రజాస్వామ్య పాలన కోరుకుంటున్నారని, రాష్ట్రంలో అరాచక పాలనకు చరమగీతం పాడి చంద్రబాబునాయుడు పాలనను కావాలనుకుంటున్నారని రాష్ట్ర టిడిపి బిసి సెల్ అధికార ప్రతినిధి చుక్కా ధనంజయ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రమైన విజయపురంలో మాట్లాడుతూ తూర్పు రాయలసీమ పట్టభద్ర అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ విజయం సమష్టి విజయమన్నారు. తొమ్మిది జిల్లాల్లో 105 నియోజకవర్గాల్లో ఓటర్లను ఎంత ప్రలోభాలకు గురి చేసినా పట్టభద్రులు నిజమైన తీర్పును అందించారని తెలిపారు. రాష్ట్రానికి అనుభవ ముఖ్యమంత్రి అవసరమని చంద్రబాబుతోనే ప్రగతి సాధ్యమని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని తెలిపారు. వైకాపా నాయకులు స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ నేతలతో ఎన్నికలు నిర్వహించి మేము గెలిచామని చెప్పుకుంటున్నారని, ప్రజలతో నేరుగా ఓటింగ్‌లో పాల్గొంటే ఫలితాలు తెలుస్తాయన్నారు. రాష్ట్ర శ్రేయస్సు కు చంద్రబాబునాయుడు నిత్యం కృషి చేస్తున్నారన్నారు.

## అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం నూతన కమిటీ

తిరుపతి ప్రెస్‌క్లబ్,మార్చి 19 ప్రభాతవార్త:

అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా నూతన కమిటీని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గ్రోసు సుబ్బారావు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఇందులో అధ్యక్షుడిగా నెల్లూరుపల్లి నాగరాజు,ప్రధాన కార్యదర్శిగా బండారు శ్రీనివాసులు,కోశాధికారిగా ఒరిగొండ గిరిధర్‌లు ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ తమ కుల వృత్తికి పూర్వ వైభవం తీసుకురావడానికి తమవంతు కృషి చేస్తామన్నారు.ప్రభుత్వం నుండి సకాలంలో కుల వృత్తిదారులకు రావలసిన రాయితీలు,విద్యుత్ రాయితీ మరియు ఇతర రాయితీలపై అవగాహన కార్యక్రమాలు జరిపి కుల వృత్తిదారులను లాభాల బాటలో నడుపుతామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నరవ అనంతం,గిద్దలూరు ప్రభాకర్,తిరుపతి హరగోపాల్,వెంకట్‌రావు, సంకిస భవాని ప్రియ,నాగరాజు,అలాగే వందల సంఖ్యలో గాండ్ల కులస్తులు పాల్గొన్నారు.

## ప్రతిభ కలిగిన క్రీడాకారులను అడాప్ట్ చేసుకుంటాం

–జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు డా॥యలమంచిలి ప్రవీణ్

తిరుపతి ప్రెస్‌క్లబ్,మార్చి 19 ప్రభాతవార్త:



జిల్లాలో ప్రతిభ కలిగిన ఫుట్‌బాల్ క్రీడాకారులను అడాప్ట్ చేసుకుని,వారికి కావలసిన సౌకర్యాలన్నింటినీ కల్పించి క్రీడల్లో రాణించేందుకు ఒలంపిక్ అసోసియేషన్ ఉపయోగపడుతుందని తిరుపతి జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు డా॥యలమంచిలి ప్రవీణ్ స్పష్టం చేశారు.ఆదివారం తిరుపతి జిల్లా ఫుట్ బాల్ అసోసియేషన్ మరియు తిరుపతి జిల్లా స్పోర్ట్స్ అథారిటీ,తిరుపతి ఒలంపిక్ అసోసియేషన్ సహకారంతో తిరుపతి జిల్లా ఫుట్ బాల్ లీగ్ మరియు నాకౌట్ టోర్నమెంట్‌ను స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ కోచ్ సయ్యద్ సాహెబ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా డా॥ప్రవీణ్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు,ఆరోగ్యంగా ఉండటానికి ఎంతో అవసరమని అన్నారు.అనంతరం డా॥ప్రవీణ్ మరో ముఖ్య అతిథి అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌తో కలిసి టోర్నమెంట్ విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు బి.సుధాకర్,ఎంఆర్.రాజు, పి.చంద్రశేఖర్,బి.శ్రీనివాసులు,కోచ్ వినోద్, తిమ్మప్ప,జగదీష్,శాలిని,,వెంకటరమణ,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బొల్లినేని జన్మదిన వేడుకలు

శ్రీకాళహస్తిరూరల్, మార్చి 19 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరికి చెందిన మాజీ సర్పంచ్ బొల్లినేని జగన్నాథం నాయుడు జన్మదిన వేడుకలను అంగరంగ వైభవంగా ఆదివారం నిర్వహించారు. రాచగున్నేరిలోని స్వగృహంలో జన నేత జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు పార్టీలు వర్గాలకు అతీతంగా అన్ని పార్టీలకు చెందిన నాయకులు, పట్టణం నుంచి భారీ ఎత్తున హాజరయ్యారు.ఇటీవల బొల్లినేని జగన్నాథం నాయుడు రాజకీయంగా, శ్రీకాళహస్తి శాసనసభ్యుడుగా ఇండిపెండెంట్‌గా పోటీ చేయుటకు విస్తృతంగా పర్యటిస్తున్నారు. కొరిన కోరని వారికి ఆర్థిక సహాయం అందిస్తున్నారు. ఆలయాలకు వితరణ ఇస్తున్నారు.ఈ నేపథ్యంలో ఆదివారం ఆయన జన్మదిన వేడుకలను తన స్వగృహంలో ఏర్పాటు చేసారు. చక్కటి విందుభోజనాలు ఏర్పాటు చేసారు. పట్టణంలోని పలువురు ప్రముఖులు,వ్యాపారస్తులు,అభిమానులు హాజరయ్యారు.

## చిందేపల్లి వాసులకు జనసేన మద్దతు



శ్రీకాళహస్తిరూరల్, మార్చి 19 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలం చిందేపల్లి ప్రజలకు ఆదివారం జనసేన మద్దతు తెలిపారు.శ్రీకాళ హస్తి ప్రధాన దారి నుంచి చిందేపల్లి గ్రామానికి ఆర్అండ్‌బి రోడ్డును నిర్మించారు. అయితే ప్రస్తుతం నిర్వహిస్తున్న రోడ్డును ఇసిఎల్ కంపెనీ రోడ్డుకడ్డంగా గోడ నిర్మిస్తున్నారు.ఈ నేపథ్యంలో ఈ సమస్య జటిలంగా మారింది.శ్రీకాళహస్తి ఇన్‌చార్జి వినూత కోట ఆమెతో పాటు జనసైనికులు కలసి చిందేపల్లి గ్రామస్థులకు పలకరించారు.ఎంతో కాలంగా ఉన్న రోడ్డును అధికారులు అడ్డదారిలో ప్రైవేటు ఫ్యాక్టరీకి అప్పగించటం దారుణమన్నారు.ఈ రోడ్డును అప్పటి లాంకో ఇప్పటి ఇసిఎల్ అక్రమ మార్గంలో కలెక్టర్ ఉత్తర్వులంటూ ఉన్న రోడ్డునుమూసివేసి గ్రామస్థులకు ఎలాంటి సదుపాయం లేని రోడ్డును కేటాయించటం దారుణమన్నారు. ఆమెతో పాటు మండల అధ్యక్షుడు కిరణ్‌కుమార్, దండిరాఘవయ్య,నితీష్, బాలాజి,భాను,సురేంద్ర, చెంచుముని, గిరిష్‌తదితరులు పాల్గొన్నారు.

## నష్టపోయిన పంటలను పరిశీలిస్తున్న పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి రూరల్, మార్చి 19 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలంలో ఆకాల వర్షాలతో నష్టపోయిన పంటలను ఆదివారం శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి తనయ బియ్యపు పవిత్రారెడ్డి పార్టీ నాయకులతో కలసి పరిశీలించారు.శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి అసెంబ్లీ సమావేశాల్లో ఉండటంతో ఆయన తనయ రేణిగుంట,తొట్టంబేడు మండలాల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి పరిశీలించారు.రెండు రోజులుగా ఆకాల వర్షాలతో నియోజకవర్గం అతలాకుతలమైంది.ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి మండలంలోని ఎంపేడు, భీమవరం, పోలి, వాంపల్లి,ఆంజనేయపురం, ఇనగలూరు, మాదిరిపల్లి, మామిడి గుంట, గోవింద్‌రావు పల్లి, తిమ్మవరం, రేపల్లి,రజాగుంట, కలవగుంట, వెలంపాడు, నిమ్మరాళ్ళపల్లి, సూరావారిపల్లి, మన్నవరం, కెపి చింతల, పాతగుంట గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి దెబ్బతిన్న వరి,వేరుశెనగ,నిమ్మతోటలను పరిశీలించారు.ఆమెతో పాటు శ్రీకాళహస్తి వ్యవసాయ కమిటి మాజీ చైర్మెన్ వయ్యాల కృష్ణారెడ్డి ఉన్నారు.

# తిరుపతి డివిజన్

## వెంకటరెడ్డి కాలనీలో దర్జాగా కాల్వపోరంకు స్థలం కబ్జా

–కాల్వపోరంబోకు స్థలంలో యదేచ్ఛగా అక్రమ నిర్మాణాలు–తెలసీ పట్టించుకొని అర్బన్ రెవెన్యూ అధికారులు

తిరుపతిరూరల్, మార్చి19 ప్రభాతవార్త:



తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో యదేచ్ఛగా కాల్వలు కబ్జాకు గురైతున్నా ఇటు నగరపాలక సంస్థ అధికారులు గానీ, అటు రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని బహిరంగ ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీ నేతలకు తలొగ్గారా లేక వాళ్ళు ఇచ్చే తాయళాలకు మైమరిచారా అనే విషయం వారికే ఏరుక. తిరుపతి అర్బన్ పరిధిలోని వెంకటరెడ్డి కాలనీలో కొత్తగా ఏర్పాటు చేసి డిబిఆర్ హస్పిటల్ రోడ్డుకు సమీపంలో కాల్వ స్థలాన్ని ఆక్రమించి దర్జాగా ఇళ్లు నిర్మించారు. పెద్దఎత్తున అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా రెవెన్యూ సిబ్బంది చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. వెంటకరెడ్డి కాలనీ సమీపంలోని పార్క్ స్థలాన్ని అనుకుని కోట్ల రుపాయాలు విలువ చేసే కాల్వపోరంబోకు స్థలంలో రెవెన్యూ కనుసన్నల్లోనే అక్రమ నిర్మాణాలు జరిగాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్రమ నిర్మాణాలు రెవెన్యూ సిబ్బందికి తెలిసీ జరుగుతున్నా అధికార పార్టీ నేతల ఒత్తిళ్ళకు తలొగ్గి అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నట్లు తెలుస్తుంది. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## జీవో నెం.1ని రద్దు చేయాలని కోరుతూ ఛలో విజయవాడకు

నగరి, మార్చి 19 ప్రభాతవార్త:



జీవో నెంబరు 1ని రద్దు చేయాలని కోరుతూ ఛలో విజయవాడకు ఈ నెల 20న పిలుపు ఇవ్వడం జరిగింది. ఈ జీవో ప్రకారం ప్రదర్శనలో ర్యాలీలో ధర్నాలను నిషేధించడం అన్యాయమని కోరుతూ ఛలో అసెంబ్లీ ముట్టడికి పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమానికి కమ్యూనిస్టు పార్టీలు కూడా మద్దతు పలికారు. అందులో భాగంగా నేడు ఛలో విజయవాడ కార్యక్రమానికి పోకుండా పోలీసులు నగరి సీపీఐ కార్యదర్శి కోదండయ్యను హౌస్ అరెస్టు చేశారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం ప్రజా సమస్యలన్నీ పరిష్కరించాలని కోరుతూ చేసే ఉద్యమాలపై పోలీసులను పంపి అరెస్టులు చేయడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా తీసుకుని వచ్చిన జీవో నెం.1ని రద్దు చేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రభుత్వం తగిన మూల్యాన్ని చెల్లించక తప్పదని అన్నారు.

## అసంపూర్తిగా వైఎస్ఆర్ ఇందిరాక్రాంతి పథం భవనం

కేవీబీ పురం, మార్చి 19 ప్రభాతవార్త:



కేవీబీ పురం మండల కేంద్రంలోని ఎంపీడీవోకార్యాలయ ఆవరణలో ఉన్న వైఎస్ఆర్ ఇందిరా క్రాంతి పథం భవనం దశాబ్ధకాలంగా అసంపూర్తిగా ఉంది. లక్షల రూపాయల వెచ్చించి భవన నిర్మాణాన్ని చేపట్టి దశాబ్ధకాలం అవుతున్నా కూడా ఇంత వరకు పెయింటింగ్‌కు(భవనానికి రంగు) వేయకపోవడంతో గోడలన్నీ కూడా మర్చిపోయి పాడుబడిన బంగ్లా కనిపిస్తుందని మహిళా సంఘ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్ని రంగాల్లో మహిళలకు ప్రభుత్వం ప్రాముఖ్యత కల్పిస్తుంది. అయితే మహిళా సంఘ సభ్యులు ఉండే భవన నిర్మాణాన్ని మాత్రం అసంపూర్తిగా వదిలేయడంతో మహిళా సంఘ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న భవనానికి రంగులు వేసి పూర్తి చేసి అలంకారంగా తీర్చిదిద్దాలని మహిళాసంఘాల సభ్యులు కోరుతున్నారు.

## కామ్రేడ్ మల్లు స్వరాజ్యంకు ఘన నివాళులు

తిరుపతి ప్రెస్‌క్లబ్,మార్చి 19 ప్రభాతవార్త:



తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు,సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు కామ్రేడ్ మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక యశోదనగర్‌లోని సిపిఎం కార్యాలయంలో నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి టి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో రజాకార్లకు వ్యతిరేకంగా,బానిస వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగిన గొప్ప పోరాటంలో మల్లు స్వరాజ్యం పాత్ర అమోఘమన్నారు. ఆమె ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఆమెకు మనం ఘనమైన నివాళులు అర్పించినట్లని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జయచంద్ర,సాయిలక్ష్మి,సిఐటియు నగర అధ్యక్షుడు పి.మునిరాజ,బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎండి.శ్రీనివాసులు,సిపిఐ నాయకులు ఎన్‌డి.రవి,తదితరులు పాల్గొన్నారు.

## యువత స్వయం ఉపాధితో ఆదర్శం కావాలి - పవిత్రరెడ్డి

రేణిగుంట, మార్చి 19 ప్రభాతవార్త:



యువత స్వయం ఉపాధి మర్గాలు ఎంచుకుని అందరికి ఆదర్శం కావాలని రేణిగుంట మండల వైసీపీ ఇన్‌చార్జి బియ్యపు పవిత్రరెడ్డి అన్నారు. రేణిగుంట పట్టనం సబ్ రిజిస్టార్ కార్యాలయం ఎదురుగా ఆదివారం పవిత్రరెడ్డి మిస్టర్ చాయ్ టీ స్టాల్‌ను ప్రారంభించారు. పలువురు పార్టీ నేతలు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువకులు స్వయం ఉపాధి ద్వారా వివిధ రంగాల్లో రాణించి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశ్రాలు కల్పించాలన్నారు. స్టాల్ నిర్వాహకుడు ఎస్.ఎం.చంద్రకాంతరెడ్డిని ఆదర్శంగా ఆదర్శంగా తీసుకోవాలని ఆయనను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, జడ్పీటీసీ సంధ్యారాణి, సర్పంచ్ నాగేషం, పట్టణవైసీపీ అధ్యక్షుడు ప్రభాకర్, సింగిల్‌విండో అధ్యక్షుడు గణేష్,వైసీపీయువజననేతరాజేష్‌రెడ్డి,మైనారిటీనేతఅలీ,పలువురువైసీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పి.వి.పురంలో టిడిపి విజయోత్సవ సంబరాలు

రామచంద్రాపురం, మార్చి 19 ప్రభాతవార్త:

పి.వి.పురంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఎంఎల్‌సి ఎన్నికల విజయోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. టిడిపి మండల ఉపాధ్యక్షుడు త్యాగరాజు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి భాణాసంఛా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎల్‌సి ఎన్నికలలో టిడిపి విజయం వైసిపి పతనానికి నాంది అన్నారు. ఎంఎల్‌సి ఎన్నికలలో ప్రజలు చూపిన అభిమానాన్ని 2024 ఎన్నికలలో సైతం చూపించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు జనార్ధన్ చౌదరి, గ్రామకమిటీ అధ్యక్షుడు మల్ రెడ్డి, నాయకులు రాజేష్ రెడ్డి, రమేష్, రాజేష్ రాయల్, నాగూర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ధ్యానంతోనే సంపూర్ణ ఆరోగ్యం

రామచంద్రాపురం, మార్చి 19 ప్రభాతవార్త:

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని జన్మ స్థలశివాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కొర్లగుంట గురునాధ రెడ్డి అన్నారు. ఆదివారం అనుప్పల్లి పంచాయతీ, రేకలచేను గ్రామంలో శుభాష్ పత్రీజీ శిష్య బృందంచే పిరమిడ్ ధ్యానం గురించి వివరించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో 41 రోజుల పాటు సాయంత్రం ధ్యానం గురించి తెలియజేస్తారన్నారు. ప్రతి ఒక్కరూ పాల్గొని సంపూర్ణ ఆరోగ్యం పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో జన్మస్థల శివాలయ వైస్ చైర్మన్ బండి తిమ్మారెడ్డి, బోర్డు సభ్యులు కొర్లగుంట ఈశ్వర్ రెడ్డి, ఎద్దల రాజా రెడ్డి, పసుపల మాదవరెడ్డి, బండి దేవరాజుల రెడ్డి, ఎద్దుల హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## పుట్ బాల్ పోటీలు ప్రారంభం

తిరుపతి (క్రీడ), మార్చి 19, ప్రభాతవార్త



జిల్లా పుట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్‌వి ఆర్ట్ కళాశాల గ్రౌండ్ నందు స్కూల్ బాలురు, బాలికలకు ఉదయం 9 ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు పుట్ బాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో జిల్లా నలుమూలల నుండి 13 జట్టు బాలురు 3 జట్లు బాలికలు పాల్గొన్నారు. ఈ పోటీలను ఛీప్ కోచ్ సయ్యద్ జిల్లా స్పోర్ట్ ఆఫీసర్ ప్రారంభించారు. సాయంత్రం నిర్వహించిన పైనల్ పోటీలలో ముఖ్య అతిథిగా జిల్లా ఒలింపిక్ అసోషియేషన్ ప్రెసిండెంట్ ప్రవీణ్, సెక్రటరీ శ్రీధర్ పాల్గొని పిల్లలకు బహుమతులు అందజేసారు. పోటీలలో చంద్రగిరి ప్రభుత్వ పాఠశాల విన్నర్స్‌గా, రేణిగుంట రన్నర్స్‌గా నిలిచారు. గుండ్లూరు వెంకటరమణ 3,4 స్థానాల వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ రాజా, మునెయ్య, చంద్రారెడ్డి, శ్రీనివాసులు నాయుడు, చెంచయ్య , కోచ్ వినోద్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

సత్యవేడు, మార్చి 19,ప్రభాతవార్త:

మండలంలోని చిన్నఈటిపాకం గిరిజన కాలనీలో పోలయ్య, శివగామిలు నివాసం ఉంటున్న పూరిగుడిసె విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా గతనెల 11న దగ్ధమైంది. దాదాపు లక్షరూపాయ మేర ఆస్థినష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న గ్రామ సమగ్ర గిరిజన ఆర్థిక సంక్షేమసంఘం వైస్‌ప్రెసిడెంట్ మస్తానయ్య, తమ బృందంతో కలిసి భాదిత కుటుంబానికి సాయం అందించారు. తమవంతు సాయంగా రూ॥5500లు నగదును, దుస్తులను భాదిత కుటుంబానికి పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో సంఘం ప్రతినిధులు భారతి, రజనీ, దిలీప్, సుజాత, రామక్రిష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### ప్రమాదమని తెలిసినా....

# పట్టించుకునేవారేరీ!?

**-బాలాజీనగర్‌కెళ్ళే రోడ్డుపైనే భవనాల వ్యర్థాలు**



ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:

తిరుమలకొండపై వందలాది కుటుంబాలు కాపురముంటున్న బాలాజీనగర్ ప్రాంతంలో భవనాల వ్యర్థాలు రోడ్డుపైనే పడేస్తుండటంతో ప్రమాదకరంగా మారాయి. ఈ వ్యర్థాలతో ప్రమాదాలు జరుగుతున్నా అటు టిటిడిగానీ ఇటు పంచాయతి అధికారులుగానీ పట్టించుకోవడంలేదని స్థానికులు ఆవేదన వెలిబుస్తున్నారు. కొండపై కురుస్తున్న అడపాదడపా వర్షాలకు ఈ వ్యర్థాలు మట్టికొట్టుకుని రోడ్డుపై పేరుకుపోయింది. అంతేగాక సిమెంట్, మట్టితో కూడిన భవనాల వ్యర్థాల్లో ఇనుపచువ్వలు, కంబీలు, చీలలు దారిన వెళ్ళే వారికి తగిలి గాయాలపాలవుతున్నారనే ఆందోళన చెందుతున్నారు. తిరుమలలో పలు రకాల వ్యాపారాలు చేసుకుంటున్న, టిటిడిలో వివిధ చోట్ల పనిచేస్తున్న ఉద్యోగులు చాలావరకు బాలాజీనగర్‌లో నివాసముంటున్నారు. వీరంతా వెళ్ళే రోడ్డుపై కొండపై పాడుబడిన భవనాలు పడగొట్టడం, స్థానికంగా కొందరు ఇళ్ళను మరమ్మతులు చేయడం జరుగుతుంటే ఆ వ్యర్థాలంతా సమీపంలోని ఖాళీస్థలంలో పడేస్తున్నారు. దీన్ని కనీసం వారం పదిరోజులకైనా పంచాయతిగానీ, టిటిడి పారిశుధ్యవిభాగం గానీ తరలించాల్సి ఉంది .అయితే ఇవేమీ పట్టించుకోపోవడంతో వ్యర్థాలు పేరుకుపోయాయి. వీటిల్లోని ఇనుపకంబీలు పైకి కనిపిస్తుండటంతో రోడ్డుపై వెళ్ళే విద్యార్థులు, వాహనదారులు కొన్ని సందర్భాల్లో వీటిపై పడి గాయాలకు గురవుతున్నారు. రాకపోకలకుకూడా అంతరాయంగా మారిందని, ఈ వ్యర్థాలను తొలగించి,స్థానికులకు భయం పోగొట్టాలని పలువురు కోరుతున్నారు.

## జగన్మోహన్‌రెడ్డి ఢిల్లికి వెళితే తప్పా!

### శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి



శ్రీకాళహస్తి,మార్చి 19 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రయోజనాల కోసం పదే పదే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఢిల్లికి వెళతారు! ప్రధాన మంత్రి నరేంద్రమోదిని బతిమలాడి నిధులివ్వమని అడుగుతారు. తప్పా అని శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి ప్రశ్నించారు. ఆయనేమైనా పాకిస్తాన్‌కు వెళ్ళారా? ముఖ్యమంత్రి శాసనసభ సమావేశాలు జరుగుతున్నా తమ ఆర్థిక దుస్థితిని ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి వివరించటానికి వెళ్ళటాన్ని తెలుగుదేశం ఎందుకు యాగీ చేస్తుందని ఆయన ప్రశ్నించారు.ఆ మహానుభావుడు అప్పులు చేస్తే, ప్రాజెక్టులను గాలికి వదలితే తమ బాధలను వివరించటానికి వెళితే రచ్చా. జగన్మోహన్‌రెడ్డి ప్రజల మనిషి, రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళుతున్నారు. మీకు చెప్పాల్సిన అవసరం లేదు.చంద్రబాబుకు రాజకీయం చేయాలన్నదే లక్ష్యం, ఆంధ్రాకు ఏమి రాకూడదన్నది లక్ష్యం. ఊళ్ళో వాళ్ళ సైకిల్‌ను స్వాధీనం చేసుకోలేదు.పని బాట లేని తెలుగుదేశం నాయకుడు లొల్లి చేయటం డిబేట్‌ల పేరుతో మైక్‌లు విరిగదీస్తారని ధ్వజమెత్తారు.రాష్ట్ర కోసం పది సార్లు కలుస్తాం. ప్రదానిని కలవకూడదా? ఇది మంచి పద్ధతి కాదన్నారు.రాష్ట్ర ప్రజలందరికి తెలుసు? ఎవరి కోసం వెళ్లారో తెలుసు. రాబోవు ఎన్నికల్లో ప్రజలే వీరికి గుణపాఠం చెబుతారని బియ్యపు మధుసూధనరెడ్డి అన్నారు.

ఫోటో -ఎస్‌కెహెచ్‌టి-2

రైటప్: మాట్లాడుతున్న బియ్యపు మధుసూధనరెడ్డి

### కలెక్టర్ గారూ!

## ప్రజల కోసమా? పారిశ్రామిక వేత్తల కోసమా?

**రైతుల్ని నక్సలైట్లలా అరెస్టులు చేస్తారా?**

**చంద్రబాబు నాయుడు దృష్టికి: బొజ్జల సుధీర్‌రెడ్డి**



శ్రీకాళహస్తి రూరల్,మార్చి 19 ప్రభాతవార్త

కలెక్టర్ గారూ! మీరు ప్రజల కోసం సమాజం కోసం పని చేస్తున్నారా? లేక ఎవరి మెప్పు కోసమో పని చేస్తున్నారా? అని శ్రీకాళహస్తి తెలుగుదేశం నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రశ్నించారు. ఆదివారం ఆయన శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరి వద్ద ఉన్న ఇసిఎల్ పరిశ్రమ వద్ద చోటు చేసుకున్న రోడ్డు వివాదాన్ని పరిశీలించారు. చిందేపల్లి గ్రామస్థులతో చర్చించారు.ఇక్కడ సమస్యను చెప్పుకోవటానికి వచ్చిన రైతులను నక్సలైట్లు గానో, లేక టెర్రరిస్టుల్లా పోలీసులు అదుపులో తీసుకొని సంబంధం లేని పోలీసు స్టేషన్లకు తరలించటం గమనిస్తే మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా? లేక రాజరికంలో ఉన్నామా? అని ప్రశ్నించారు.

**ఈ సమస్యను చంద్రబాబు దృష్టికి తీసుకొస్తా!**

శ్రీకాళహస్తి మండలంలోని చిందేపల్లి గ్రామానికి సుమారు80సంవత్సరాలుగా ఈ మార్గంగుండానే దారి ఉండేది. ఇక్కడ పరిశ్రమలు రావాలనే లక్ష్యంతో తనతండ్రి లాంకో ఫ్యాక్టరీ ఏర్పాటుకు అప్పటి నాయకుడు ఉపేంద్ర ప్రయత్నించగా కొంత స్థలం ప్రభుత్వం మరి కొంత స్థలాన్ని తమ బంధువులకు సంబంధించినది కొని ఇచ్చింది కూడా తన తండ్రియే అని సుధీర్‌రెడ్డి వివరించారు. మరి ఇన్ని వాస్తవాలు ఉండగా జిల్లా కలెక్టర్, ఎస్‌పి శాంతి భద్రతలను కాపాడుతూ, ప్రజల సమస్యలను పరిష్కరించాల్సింది మాని ఫ్యాక్టరీకి వత్తాసుపలుకుతూ సామాన్య ప్రజల్ని అణగదొక్కడానికి ప్రయత్నిస్తారా?అన్ని డ్యాక్యుమెంట్లు పరిశీలించాను. ఇక్కడ రికార్డుల్లో ఆర్‌అండ్‌బి రోడ్డు అని ఉంది. ప్రభుత్వం ఆస్తిని, ప్రజలకు సంబంధించిన రోడ్డును ప్రైవేటు కంపెనీకి ఎలా అప్పగిస్తారని ప్రశ్నించారు. ఇది న్యాయమా? అని ప్రశ్నించారు.

**వ్యర్థాలతో గ్రామాలు అతలా కుతలం:**

ఇక ఇసిఎల్ ఫ్యాక్టరీకి సంబంధించిన వ్యర్థాలు వరవ కాలువ ద్వారా వచ్చిన వ్యర్థాలతో గ్రామాలకు సంబంధించిన చెరువుల్లో నీరు కలుషితమై చేపలు చనిపోతున్నాయి. అంతేకాక పశువులు కూడా చనిపోతున్నాయని వివరించారు.మరి కాలుష్యనివారణ శాఖ నిద్రపోతుందా? అని ప్రశ్నించారు. వారికి క్లియర్ సర్టిఫికేట్లు ఎలా మంజూరు చేస్తున్నారని సుధీర్‌రెడ్డి ప్రశ్నించారు.ఈ సమస్యను చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళతాము. రికార్డులన్ని తీసుకున్నాను. నాడు పరిశ్రమ ఏర్పాటుచేసిన లగడపాటి రాజగోపాల్‌ను పిలిపించుకొని వాస్తవాలేమిటో నిగ్గు తేలుస్తామని వివరించారు. పోలీసులు శాంతి భద్రతలను పరిరక్షించాలి కానీ ప్రజల్ని నక్సలైట్లుగా చిత్రించకూడదన్నారు. 300 పోలీసులు ఇక్కడ ఎందుకు? ఇంత అరాచకమా? అని ప్రశ్నించారు.జగనన్న కాలనీ లింకు చూపి సుమారు4కిలోమీటర్ల దారిని ఎలా చుట్టుకొని వస్తారని ప్రశ్నించారు.

# అకాల వర్షాలతో మునిగిన పంటలు



దెబ్బతిన్న పంటలనుపరిశీలిస్తున్న అధికారులు

సదుం,మార్చి19 ప్రభాతవార్త

అకాల వర్షాలకు పలమనేరు డివిజన్‌లోని పలు మండలాల్లో వివిధ రకాల పంటలు దెబ్బతిన్నాయని హార్టికల్చర్ డీడీ మధుసూధనరెడ్డి తెలిపారు. గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు పుంగనూరుమండలంలో180 ఎకరాలలో టమోటా, 5 ఎకరాలలో కాలిఫ్లవర్, చౌడేపల్లె మండలంలో 25 ఎకరాలలో టమోటా, 8 ఎకరాలలో బంగాళాదుంప, సోమల మండలంలో 12 ఎకరాలలో టమోటా , రొంపిచెర్ల మండలంలో 52 ఎకరాలలో టమోటా,12 ఎకరాలలో దోస పంట, పెద్దపంజాని మండలంలో 58 ఎకరాలలో టమోటా,8 ఎకరాలలో కాలిఫ్లవర్, సదుం మండలంలో టమాట 5 ఎకరాలలోను, పువ్వులు 2 ఎకరాలలోను, పులిచెర్ల మండలంలో టమాట 13 ఎకరాలలో గంగవరం మండలంలో టమాటా6 ఎకరాల చొప్పున దెబ్బతిన్నాయి. వీటిని ఆదివారం హార్టికల్చర్ అధికారులు

### పర్యటించిన అధికారులు

పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. తుపాను వల్ల దెబ్బతిన్న పంటల వివరాలను ప్రభుత్వానికి పంపిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వంతరపున రావలసిన రాయితీలు వచ్చేలా చర్యలు చేపడుతామని పేర్కొన్నారు. ఈసందర్భంగా డీడీ మాట్లాడుతూ వడగల్ల తో కూడిన వర్షం వల్ల టమాట, బంగాళదుంప, బొప్పాయి,అరటి, కాబేజీ, కాలిఫ్లవర్ వంటి మూరగాయలకు అధిక నష్టం వాటిల్లిందన్నారు. అరటి చెట్లు విరగడం, బొప్పాయిలో ఆకులు విరగటం, టమోటాలో కొమ్మలు విరగడం, కాయలు , పిందెలు రాలిపోవడం మరియు కొమ్మలు,పిందెలపై మచ్చలు ఏర్పడూయన్నారు. తద్వారా నాణ్యత తగ్గి దిగుబడి తగ్గుతుందని చెప్పారు. ఈఅకాల వర్షాల కారనం తోటలలో తెళ్లు వ్యాప్తి అధికమవుతుందని వాటి నివారణకు రైతులు చర్యలు తీసుకోవాలన్నారు. టమాట మరియు ఇతర కూరగాయలలో అయితే ఆక్రోబైట్ 3 మిల్లీలు లీటరు నీటికి చొప్పున, లేదా అమిస్టాల్ ఒక మిల్లీ లేదా సో క్రర్ 0.5మిల్లీలు లేదా కొసైడ్ 2 గ్రామలు చొప్పున ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. మామిడి పంటలో అయితే నల్లమచ్చలు వచ్చే సూచనలు అధికంగా ఉన్నాయని వాతావరణం పొడిబారిన తర్వాత మాంకోజెబ్ ఒక గ్రాము లేదా థయోఫినైల్ మిథేట్‌లేదా టిల్ట్ 0.5 గ్రాములు ఒక లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో హార్టికల్చర్ ఆఫీసర్ సంతోషికుమారి,ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.



నీటితో నిండిపోయిన దోసపంట

### వైకాపా ఆరాచక పాలన అంతానికి

## పట్టభద్రులు నాంది పలికారు

**- తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి**



తిరుపతిరూరల్, మార్చి19 ప్రభాతవార్త:

రాష్ట్ర వ్యాప్తంగా 108 నియోజకవర్గాలలో 3స్థానాలలో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు గెలవడం హర్షణీయమని తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఏ.ఈశ్వరరెడ్డి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పట్టభద్రులు వైకాపా అరాచకపాలన అంతానికి నాంది పలికారని, ప్రభుత్వ మార్పును కొరుకొంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 108 నియోజకవర్గాలలో 3స్థానాలలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలలో టిడిపి అభ్యర్థులు గెలుపుపై తిరుపతిరూరల్ టిడిపి శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ఆదివారం రఘునాథ్ రిసార్ట్స్‌లో ఉన్న టిడిపి కార్యాలయంలో అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి ఆధ్వర్యంలో భారీ ఎత్తున బాణా సంచాలు పేల్చి, కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 108 నియోజకవర్గాలలో పట్టభద్రులు ఇచ్చి తీర్పు అనిర్వచనీయమని, ప్రభుత్వ మార్పుకు నాందిగా వర్ణించారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రజాస్వామ్య బద్ధంగా జరగనప్పటికీ పట్టభద్రులు ముందుచూపుతో టిడిపి అభ్యర్థులకే పట్టం కట్టి, వైకాపా పతనానికి నాంది పలికారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో వైకాపా గెలుపు కోసం ఎన్నికుట్రలు, కుతంత్రాలు పన్నినా....దొంగ ఓట్లు వేయించిన గెలుపు మాత్రం టిడిపికే దక్కిందన్నారు. వైకాపా ప్రజాప్రతినిధుల అరాచకాలు, దౌర్జాన్యాలను తరిమికొట్టాలంటే రాబోయే సాధారణ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని పిలుపునిచ్చారు. వైకాపా ప్రజాప్రతినిధుల నిరంకుశ పాలను ప్రజలు గమనిస్తున్నారని, సార్వత్రిక ఎన్నికలలో అంతిమ తీర్పు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో తూర్పు రాయలసీమ నుండి కంచర్ల శ్రీకాంత్, పశ్చిమ రాయలసీమ నుంచి భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, ఉత్తరాంధ్ర నుండి వేపాడు చిరంజీవి రావు గెలుపే నిదర్శనమని పేర్కొన్నారు. టిడిపి జాతీయ కార్యధర్శి నారా లోకేష్ నిర్వహిస్తున్న యువగళం పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. తిరుపతిరూరల్ టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## వైభవంగా నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం



కోట, మార్చి 19 ప్రభాతవార్త

కోట మండలం చిట్టేడు గ్రామంలోని శ్రీసీతా సమేత కోదండరామస్వామి ఆలయంలో ఆదివారం వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ భక్తుల సమూహం మధ్య గోవింద నామ స్మరణలతో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం, కుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు వందలాది మంది భక్తులు చేరుకున్నారు. ప్రత్యేక హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం కన్నులపండువగా కొనసాగింది. అనంతరం సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులను వివిధ పుష్పాలతో అలంకరించి మంగళ వాయిద్యాలు, బాణాసంచా వేడుకలు గ్రామోత్సవం అంగరంగ వైభవంగా పురవీధుల్లో కొనసాగింది. ఈకార్యక్రమం శ్రీరామభక్తబృందం ఆధ్వర్యంలో జరిగింది.

## శివయ్యను దర్శించుకున్న కంచర్లశ్రీకాంత్



శ్రీకాళహస్తి, మార్చి 19 ప్రభాతవార్త

తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు మరియు తెలుగుదేశంపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బలపరచిన పట్టభద్రుల ఎన్నికల్లో విజయం సాధించిన కంచర్ల శ్రీకాంత్ ఆదివారం శ్రీకాళహస్తీశ్వరున్ని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆయన స్వామిఅమ్మవార్లను ప్రత్యేకంగా దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆయనకు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలసుధీర్‌రెడ్డి శ్రీకాళహస్తీశ్వరుని చిత్రపటాన్ని తీర్థప్రసాదాలను అందించారు.

## కోదండరాముని బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



తిరుపతి,మార్చి 19ప్రభాతవార్త:

తిరుపతి కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆదివారం సాయంత్రం శాస్రోక్తంగా అంకురార్పణ జరిగింది. సాయంత్రం కోదండరామస్వామి,సేనాధిపతి ఉత్సవం ఊరేగింపు అనంతరం రాత్రి 6.30గంటల నుంచి 7.15గంటల మధ్య మేదినిపూజ. మృత్సంగ్రహణం,అంకురార్పణ నిర్వహించారు. నేడు సోమవారం ఉదయం 8.45గంటలనుంచి ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. ప్రతిరోజూ ఉదయం 8గంటల నుంచి 9.30గంటలవరకు, తిరిగి రాత్రి 7గంటల నుండి 8.30గంటల వరకు వాహనసేవలు నిర్వహిస్తారు. తొలివాహనంగా సోమవారం రాత్రి పెద్దశేషవాహనంపై కోదండరాముడు ఊరేగనున్నారు. శాస్రోక్తంగా జరిగిన అంకురార్పణలో డిప్యూటీ ఈఓలు నాగరత్న, గోవిందరాజన్, ఏఈఓమోహన్, సూపరింటెండెంట్ రమేష్, ప్రధానఅర్చకులు ఎపి ఆనందకుమార్ దీక్షితులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు సురేష్,చలపతి ,అర్చకులు పాల్గొన్నారు.

## జగన్ పాలనపై ప్రజల్లో ఆగ్రహం

### గాలి భానుప్రకాశ్



పుత్తూరు, మార్చి 19 ప్రభాతవార్త :

ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి పాలనపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో వున్నారని ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు రుజువు చేస్తున్నాయని తెలుగుదేశం పార్టీ నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాశ్ అన్నారు. పట్టభద్రులు విజ్ఞతతో ఆలోచించి టిడిపికి ఓటేశారని వారికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర, యువత భవిష్యత్ తెలుగుదేశం పార్టీతోనే వుందని ప్రజలు విశ్వసిస్తున్నారని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాలుగేళ్లుగా జగన్ నిరుద్యోగ యువతను మోసం చేస్తూనే వున్నారని ఆరోపించారు. ఈ ఎన్నికల ఫలితాలు యువత జగన్‌కు ఇచ్చిన రిటర్న్ గిఫ్ట్ అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అవినీతి తప్ప అభివృద్ధే లేదన్నారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, సార్వత్రిక ఎన్నికలు ఎపుడొచ్చినా విజయం టిడిపిదేనని తెలిపారు.

## భక్తులకు శరణాగతి నేర్పిన అన్నమయ్య



తిరుపతి,మార్చి19ప్రభాతవార్త:

అన్నమాచార్య వర్ధంతి వేడుకల్లో ఆదివారం ఉదయం అన్నమాచార్యకళామందిరంలో సాహితీసదస్సులు జరిగాయి. భక్తులకు శరణాగతి నేర్పిన అన్నమయ్య అని ఎస్వీ విశ్వవిద్యాలయం విశ్రాంత అధ్యాపకురాలు ఆచార్య కట్టమంచి మహాలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో తుడకార్యదర్శి లక్ష్మి, అన్నమాచార్యప్రాజెక్టు సంచాలకుడు డాక్టర్ విభీషణ శర్మ ,టిటిడి ఆస్థాన విద్వాంసుడు గరిమెళ్ళ బాలకృష్ణప్రసాద్, భక్తులు,అన్నమాచార్యప్రాజెక్టుకళాకారులు పాల్గొన్నారు.

## డయల్ యువర్ కమిషనర్, స్పందన

### కమిషనర్ అనుపమ అంజలి

తిరుపతి కార్పొరేషన్, మార్చి 19,ప్రభాతవార్త

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం 20వ తేది ఉదయం 10 నుండి 11 వరకు డయల్‌యువర్ కమిషనర్ కార్యక్రమం, 11 నుండి 12 గంటల వరకు నేరుగా అర్జిలు, పిర్యాదులు స్వీకరించే స్పందన కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ తెలిపారు. 0877-2227208 నంబర్‌కి కాల్ చేసి తమ ఫిర్యాదులు తెలియజేయవచ్చు అని నేరుగా వచ్చి అర్జిలు, ఫిర్యాదులు ఇవ్వవచ్చన్నారు.

## విస్తారంగా సన్ ఫ్లవర్ సాగు



విజయపురం, మార్చి 19 ప్రభాతవార్త :

మండలంలో సన్ ఫ్లవర్‌ను పంటను విస్తారంగా సాగు చేస్తున్నారు. మండలంలోని పన్నూరు, కళియంబాకం, జగన్నాథపురం, కాళికాపురం, పోతురాజులు కండ్రిగ, బూచివానత్తం ప్రాంతాల్లో సన్ ఫ్లవర్‌ను ఎక్కువగా సాగు చేస్తున్నారు. మండలంలో సాగు చేస్తున్న సన్ ఫ్లవర్ పూత దశలో వుండడం వల్ల చూపరులను ఆకట్టుకుంటోంది. మండలంలో సుమారు 112 హెక్టార్లలో సన్ ఫ్లవర్ సాగవుతోందని వ్యవసాయ శాఖాధికారులు తెలిపారు.

## వైభవోపేతంగా ప్రదోషపూజలు



నాగలాపురం, మార్చి 19 ,ప్రభాతవార్త:

సురుటుపల్లి శ్రీపల్లికొండేశ్వరాలయంలో ఆదివారం సాయంత్రం నందీశ్వరునికి, మూల విరాట్ వాల్మీకేశ్వర స్వామి వారికి ఏకకాలంలో ప్రదోష పూజలను వైభవోపేతంగా నిర్వహించారు. అర్చకులు మంగళహారతులతో స్వామి వార్లకు దూప, దీప ,నైవేద్యాలను నివేదించారు. ఉభయదారులుగా చెన్నై గంగవరాజన్, కోయంబత్తూరు రామ్ కుమార్, బెంగుళూరు కుమార్‌లు పాల్గొన్నారు. ఆలయ ఛైర్మేన్ ఏవియం బాలాజీ రెడ్డి పూజా కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈవో, ట్రస్ట్‌బోర్డ్ సభ్యులు పాల్గొన్నారు.

# పెద్దబైలులో పశువుల పండుగ - చెక్క పట్టీల కోసం కుస్తీ





వెదురుకుప్పం,మార్చి 19 ప్రభాతవార్త :

ఎద్దబైలులో ఆదివారం కొడెగిత్తలు అల్లి వద్ద కాలు దువ్వడంతో .. యువకులు రెట్టించిన ఉత్సహంతో చెక్క పట్టీల కోసం పౌరుషంతో బరిలోకి దిగి పోటా పోటీగా కుస్తీకి దిగడంతో పశువుల సంబరాలు అంబరాన్ని అంటాయి. మండలంలోని తిరుమలయ్య పల్లె పంచాయితీ పరిధిలోని పెద్దబైలులో ఉగాది పురష్కరించుకుని పశువుల పండుగ నిర్వహించారు. యువకులు గ్రామాన్ని రంగు పేపర్ల, మామిడి తోరణాలతో ప్రత్యేక అలంకరించి పశువుల పండుగకు అందగా ముస్తాబు చేశారు. రైతులు గిత్తలకు కొమ్ములు చెక్కి రంగులు వేసి ఇష్టమైన దేవుళ్ళు, సినిమా హీరోల ఫోటోలు ఉన్న చెక్క పట్టీలు, టవళ్ళు, బెలూన్స్‌తో ప్రత్యేకంగా అలంకరించి బరిలోకి దించడంతో యువకులు రెట్టించిన ఉత్సహంతో అల్లివద్ద పోటా పోటీగా కుస్తీకి దిగారు. దీంతో గ్రామంలో ఒక్కసారిగా పండుగ వాతావారణం నెలకుంది. చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో జనం చేరుకోవడంతో మిద్దెలు, వీధులు జన సంద్రంగా మారిపోయాయి. అలంకరించి గిత్తలను దప్పుల దరువులు మధ్య అల్లె వద్ద వదలడంతో యువకులు రెట్టించిన ఉత్సహంతో బరిలోకి దిగి చెక్క పట్టీల కోసం గిత్తలతో కుస్తీకి దిగడంతో ఈలలు, కేరితల నడుమ నువ్వ ... నేన అంటూ పోటా పోటీగా పోరు జరిగింది. కొమరగుంటలో సంబరాలు అంబరాన్ని తాకాయి.చెదురు మదురు సంఘటలు మినహా అద్యంతం పోటీలు రవవత్తంగా మారాయి. ప్రశాంత వాతావరణంలో పండుగా నిర్వహించుకున్నారు. చుట్టపక్కల మండలాల నుంచి జనం తరలివచ్చారు. వర్షం కారణంగా ఆలస్యంగా సంబరాలు నిర్వహించారు.